

రోహిణీ కార్తె ఆగమనం

వానాకాలం సాగుకు రైతులు సన్నద్ధం
పత్తి రైతును వెంటాడుతున్న నకిలీ భయం
అప్రమత్తమైన వ్యవసాయ శాఖ అధికారులు
నిఘా పెట్టేందుకు టాస్క్‌ఫోర్స్ బృందాలు



(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల) వానాకాలం సాగుకు సన్నద్ధమైన రైతులు రుతు పవనాల ఆగమనం కోసం చూస్తున్నారు. రోహిణీ కార్తె కంటే ముందే ఈసారి జల్లులు పడుతున్నాయి. నిన్నమొన్నటి వరకు నిప్పుల కొలిమిలా ఉన్న వాతావరణం ఒక్కసారిగా చల్లబడి రుతు పవనాలు వచ్చేశాయా అన్నట్లుగా మారింది. అల్పపీడన ప్రభావంతో జిల్లాలో ప్రస్తుతం 898.6 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి గాను 1160 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో 10 మండలాల్లో అధిక వర్షపాతం నమోదు కాగా, మూడు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. మరోవైపు నైరుతి కంటే ముందే నకిలీ విపత్తు పొంచి ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నైరుతి రుతు పవనాలు ఈసారి ముందుగానే వస్తాయనే సంకేతాలతో వ్యవసాయ శాఖ అప్రమత్తమైంది. నకిలీ విత్తనాలపై దృష్టి పెట్టింది. ప్రతి సంవత్సరం లాగానే ఈసారి కూడా నకిలీ విత్తనాలపై నిఘా పెట్టేందుకు టాస్క్‌ఫోర్స్ బృందాలను సిద్ధం చేసింది.

జిల్లాలో ఇప్పటివరకు వర్షపాతం (మి.మీ.లో)

మండలం	సాధారణం	కురిసింది
రుద్రంగి	951.8	1,088.0
చందుర్తి	979.0	1,493.7
వేములవాడ రూరల్	990.5	1,011.2
బోయినపల్లి	848.2	1,165.0
వేములవాడ	998.4	1,227.1
సిరిసిల్ల	948.6	1,105.4
కోనరావుపేట	860.6	1,091.2
వీర్నపల్లి	895.2	1,403.7
ఎల్లారెడ్డిపేట	874.3	1,126.9
గంభీరావుపేట	843.4	1,032.1
ముస్తాబాద్	782.1	1,129.5
తంగళ్లపల్లి	947.8	1,146.8
ఇల్లంతకుంట	762.0	1,066.9
సరాసరి	**898.6**	**1,160.6**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రధానంగా వరి, పత్తి సాగు వైపు రైతులు మొగ్గు చూపుతారు. ఇందులో ప్రధానంగా పత్తి రైతులు నకిలీ విత్తనాల బారినపడుతున్నారు.

వానాకాలం సీజన్ ముందే వేసవిలోనే రైతులు విత్తనాలు బుకింగ్ చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. మేలు రకం విత్తనాల కోసం అడ్వాన్స్‌లు కూడా చెల్లిం చే పరిస్థితి ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని విత్తన వ్యాపారులు గ్రామాల్లో తిరుగుతూ దొడ్డి దారిన నకిలీ కంపెనీల విత్తనాలను రైతులకు అంటగట్టే ప్రక్రియ మొదలైనట్లు తెలుస్తోంది. వ్యవసాయ శాఖ వివిధ సాంకేతిక పద్ధతుల్లో యాప్‌లు, విక్రయాలపై నిఘా పెట్టినా నకిలీ విత్తనాలు జిల్లాకు వస్తూనే ఉన్నాయి. నకిలీ విత్తనాలతో పాటు నిషేధిత బీటీ 3 పత్తి విత్తనాల అమ్మకాలు సాగుతూనే ఉన్నాయి. పోలీస్ నిఘా ఉన్నా నకిలీ విత్తనాలు అమ్మకాలు జరగడం, పట్టుబడడం మామూలుగా మారింది. బ్రాండెడ్ విత్తనాలతో పాటు గుర్తింపు లేని కంపెనీ విత్తనాలు కూడా గ్రామాల్లో తెర చాటుగా అమ్మకాలు ప్రతీయేటా సాగుతూనే ఉన్నాయి. తెలంగాణలో పత్తిసాగు జరుగుతున్న జిల్లాల్లో రాజన్న సిరిసిల్ల కూడా ప్రధానంగా ఉండడంతో వ్యాపారులు జిల్లాపై ప్రతీయేటా నకిలీ విత్తనాలు, గుర్తింపులేని విత్తనాలను అంటగట్టే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు.

జిల్లాలో ఖరీఫ్ సాగు లెక్కలు

మండలం	వరి	పత్తి	ఇతర	మొత్తం
గంభీరావుపేట	18,600	200	530	19,330
ఇల్లంతకుంట	24,000	12,500	1,970	38,470
ముస్తాబాద్	23,000	600	1,650	25,250
సిరిసిల్ల	4,900	850	103	5,853
తంగళ్లపల్లి	19,950	1,000	1,081	22,031
వీర్నపల్లి	8,360	400	32	8,792
ఎల్లారెడ్డిపేట	17,500	3,600	30	21,130
బోయినపల్లి	13,000	7,000	1,310	21,310
చందుర్తి	15,200	6,200	210	21,610
కోనరావుపేట	18,200	4,800	700	23,700
రుద్రంగి	5,900	3,400	805	10,105
వేములవాడ	5,200	5,010	368	10,578
వేములవాడ రూరల్	11,050	4,200	364	15,614
మొత్తం	**1,84,860**	**49,760**	**9,153**	**2,43,773**

కనుమరుగైన రోహిణీకార్తె సంబరం

రోహిణీకార్తె వచ్చిందంటే రైతులు సంప్రాదాయ బద్ధంగా ఎన్నో పనులు చేసేవారు. కనుమరుగైపోయిన రోహిణీకార్తె సంబరంపై రైతులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. రోహిణీకార్తెకు వాతావరణమంతా చల్లబడి మబ్బులు కమ్ముకుంటాయి. ఈసారి రోహిణీకార్తెతోనే వర్షాలు మొదలయ్యాయి. వాతావరణ శాఖ కూడా రుతుపవనాలు ముందే వస్తాయని సూచనలు చేస్తోంది. రోహిణీకార్తెకు చిన్నపాటి రైతులు తీపిపదార్థాలు చేసుకుంటే... పెద్ద రైతులు గొర్రె పిల్లనో, మేకపిల్లనో కోసుకొని పెద్ద పండుగను జరుపుకునే వారు. ఇప్పుడు రోహిణీకార్తె వచ్చినా సిరిసిల్లకు కూలీ పనులకు పోతున్నారు. ఆరేడు ఎకరాలు ఉన్న వారు కూడా ఊరువదిలి పట్టణాల్లో కూలీనాలి చేసుకునే పరిస్థితి ఉందని మిగతా 8వ పేజీలో..

ఉద్యానవన పంటలకు ప్రోత్సాహం

- రాష్ట్రీయ కృషి వికాస్ యోజనలో 30 యూనిట్ల లక్ష్యం

- జిల్లా ఉద్యానవన అధికారి లత

సిరిసిల్ల, మే 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యానవన పంటలను ప్రోత్సహిస్తూ జిల్లాలో 2025-2026 ఆర్థిక సంవత్సరానికి ఉద్యానవన శాఖ ప్రణాళిక ఖరారుచేసింది. శనివారం జిల్లా ఉద్యానవన అధికారి లత యాక్షన్ ప్లాన్ వివరాలను వెల్లడిం చారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ద్వారా సూక్ష్మ సేద్యం, తుంపర్ల సేద్యం, శాశ్వత పందిరి నిర్మాణం ద్వారా కూరగాయల సాగు, నేషనల్ మిషన్ ఎడిబుల్ ఆయిల్ ద్వారా పామాయిల్ చెట్లు నాటించడం, సమీకృతఅభివృద్ధి మిషన్ ద్వారా పండ్ల తోటల పెంపకం కూరగాయలు, పూల తోటలు, ఉద్యానవన యాంత్రీకరణ, వెదురుచెట్లు నాటించడం వంటి కార్యక్రమాలను కార్యాచరణలో రూపొందించారు.

● జిల్లాలో 2 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్

జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు ఈ సంవత్సరం 2వేల ఎకరాలకు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆయిల్‌పామ్ మొక్క ఖరీదు రూ.193 నిర్ణయించారు. ఇందులో రైతు వాటాగా రూ.20 చెల్లించాల్సి ఉంటుంది. ఎకరానికి 50మొక్కలు నాటిస్తారు. సమగ్ర ఉద్యాన మిషన్ ద్వారా పండ్ల తోటల పెంపకానికి 50 శాతం, కూరగాయలతోటల పెంపకానికి 40 శాతం సబ్సిడీ ఇవ్వనున్నారు. డ్రాగన్ ఫ్రూట్ తోట కోరకు 12.50ఎకరాలు, బొప్పాయి తోట కోరకు 22.50ఎకరాలు, మామిడితోట 25ఎకరాలు, జామతోట 5ఎకరాలు, కూరగాయల నారు కోసం 87.50ఎకరాలు, సుగంధ ద్రవ్యాల విత్తనాల కోసం 57.50 ఎకరాలు, మామిడి తోటల పునరుద్ధరణ 50 ఎకరాలు, మల్చింగ్ కోసం 125ఎకరాలు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉద్యానవన యాంత్రీకరణ కోసం పనిముట్లు, పవర్‌టిల్లర్, పవర్ రీడర్‌లు, బ్రష్ కట్టర్‌లు, పవర్ స్ప్రేయర్‌లు అందించనున్నారు. కూరగాయల సాగు పందిరి నిర్మాణాల కోసం 30 యూనిట్లు, వెదురుమొక్కలు నాటించడం కోసం 2వేల మొక్కలు లక్ష్యంగా పెట్టుకున్నారు. బిందు సేద్యం కోసం 437 ఎకరాలు, తుంపర సేద్యం 212 ఎకరాలు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలకు వంద శాతం రాయితీ, సన్నకారు, చిన్నకారు రైతులకు 80 శాతం రాయితీ కల్పించనున్నారు.

రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి..

- లత, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి



ఉద్యానవన పంటల సాగుకు ఇస్తున్న రాయితీని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. 2025-26 ఆర్థికసంవత్సరం ప్రణాళికను రూపొందించడం జరిగింది. రైతులు దరఖాస్తుతోపాటు పట్టాదారు పాసుపుస్తకం అధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్స్‌తో జత చేసి పథకాలను సద్వినియోగం చేసుకోవాలి.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు



వివరాలు తెలుసుకుంటున్న ట్రైనీ ఎస్‌ఐ వినీతరెడ్డి

తంగళ్లపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి) : తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామ శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. స్థానికులు, క్షతగాత్రులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న ప్యాసింజర్ ఆటోతో పాటు మరో కారును ఢీకొంది. దీంతో కారు డ్రైవర్ సత్యనారాయణ తీవ్రంగా గాయపడగా, కారులో ప్రయాణిస్తున్న శ్రీలత, కార్తీక్‌లు స్వల్పంగా గాయపడ్డారు. అలాగే ఆటోలో ప్రయాణిస్తున్న మరో ఇద్దరికి స్వల్పంగా గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో రెండు కార్లు, ఆటో ధ్వంసం అయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో సిరిసిల్ల జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించారు. ట్రైనీ ఎస్‌ఐ వినీతరెడ్డి సిబ్బందితో చేరుకొని ప్రమాదంలో ధ్వంసమైన వాహనాలను రోడ్డుపై నుంచి తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

వైన్స్ షాపులో చోరీ

వేములవాడ రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): హన్మాజిపేట వైన్స్ షాపులో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హన్మాజిపేట శివారులో గల వైన్స్ షాప్‌లో శనివారం తెల్లవారు జామున రెండు గంటల సమయంలో చోరీ జరిగింది. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్సై మారుతీ అక్కడి సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. ఇద్దరు ముసుగు వేసుకున్న వ్యక్తులు వైన్స్ షాపులో చొరబడగా ముగ్గురు వ్యక్తులు షాపునకు సమీపంలో అనుమానాస్పదంగా ఉన్నట్లు గుర్తించారు. వైన్స్ షాపులో ఉన్న రూ.30 వేలతో పాటు మద్యం బాటిళ్లను దొంగలు ఎత్తుకెళ్లారు. వైన్స్‌షాప్ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గ్రామ పాలన అధికారి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

● సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ ● పరీక్షల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, మే 24 (ఆంధ్రజ్యోతి): గ్రామ పాలన అధికారి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో శనివారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాదు నుంచి సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ ఆదివారం జరిగే గ్రామ పాలన అధికారి పరీక్షల నిర్వహణపై కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే గ్రామ పాలన అధికారి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, జిల్లాలో నోడల్ అధికారి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు ఉదయం 8 గంటల వరకు జవాబు పత్రాలను, 9.20 గంటల వరకు ప్రశ్నా పత్రాలను తరలించాలని అన్నారు. పరీక్షలు ముగిసిన తర్వాత జవాబు పత్రాలను సరిగ్గా సీల్ చేసి జేఎన్టీయూహెచ్‌కు అందించాలని, ఉపయోగించని జవాబు పత్రాలను కూడా తప్పనిసరిగా పరీక్ష కేంద్రాల నుంచి సేకరించాలని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద సీటింగ్ అరెంజ్‌మెంట్‌లు పక్కాగా ఉండాలని, అభ్యర్థులకు అవసరమైన తాగు నీరు, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా వంటి సదుపాయాలు కల్పించాలని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద అవసరమైన మేర ఇన్విజిలేటర్ నియమించాలని, అభ్యర్థులు ఏవిధమైన ఎలక్ట్రానిక్, వాచీలు తీసుకురావద్దని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఫస్ట్‌ఎయిడ్ కిట్, ఓఆర్ఎస్ ప్యాకెట్లతో మెడికల్ టీం ఏర్పాటు చేయాలని, పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ చర్యలు తీసుకోవాలని, పరీక్ష కేంద్రాల రూట్‌లలో బస్సు నడపాలని అన్నారు. పరీక్షా కేంద్రాల చుట్టూ పక్కల జిరాక్స్ షాపులు మూసివేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, గీతనగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శారద, కలెక్టరేట్ ఏవో రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

- కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలి - సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న స్కైలాబ్‌బాబు

సిరిసిల్ల రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులను ఏరివేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి వారితో చర్చలు జరపాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్‌శుక్లా కార్మిక భవనంలో శనివారం సీపీఎం జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి హాజరైన స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ ఛతీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లాలోని అబూజ్‌మాడ్ అడవుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు అలియస్ బస్వరాజుతోపాటు 27మంది నక్సలైట్లను కేంద్ర ప్రభుత్వ పోలీసు బలగాలు ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చిచంపడాన్ని సీపీఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. బీజేపీ ప్రభుత్వం తన క్రూరమైన వైఖరిని మార్చుకొని మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులు చర్చలు జరపాలంటూ అనేక సార్లు కేంద్ర ప్రభుత్వానికి విన్నపాలను చేసినా నిర్లక్ష్యం చేసిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఛతీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వంతో చర్చల ద్వారా పరిష్కారాన్ని కనుగొనే మార్గాన్ని వదిలేసి, హింసతో కూడిన విధానాన్ని అనుసరిస్తోందని, ఇవి ముమ్మాటికీ కేంద్ర ప్రభుత్వ హత్యలేనని అన్నారు.కేంద్ర హోంశాఖ మంత్రి, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిలు చేసిన ప్రకటనల్లో చర్చలు అవసరం లేదని పేర్కొనడం ఫాసిస్టు లక్షణాలను ప్రతిబింబిస్తున్నాయని, ఇవి ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. మావోయిస్టుల రాజకీయ విధానంపై సీపీఎం వ్యతిరేకంగా ఉన్నప్పటికీ చర్చల కోసం వచ్చిన వారి విజ్ఞప్తిని ప్రభుత్వం అంగీకరించి తక్షణమే పారామిలిటరీ పోలీసు కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నరమేధాన్ని నిలిపివేసి శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, జివ్వాజి విమల, కోడం రమణ, మాల్లారపు అరుణ్ కుమార్, సభ్యులు ముక్తికాంత అశోక్, అన్నల్‌దాస్ గణేష్, సూరం పద్మ, గురజాల శ్రీధర్, మల్లారపు ప్రశాంత్, శ్రీరాముల రమేష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వేములవాడలో కొనసాగుతున్న భక్తుల రద్దీ..



భక్తులతో సందడిగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శనివారం రాజన్న ఆలయానికి సుమారు 50వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయాధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో నిండిపోయాయి. ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించిన భక్తులు ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, కోడెమొక్కు క్యూలైన్‌లలో ఆలయంలోకి ప్రవేశించి రాజన్నను దర్శించుకున్నారు. రాజన్నకు ఇష్టమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రేవతి నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు..

రేవతి నక్షత్రంను పురస్కరించుకుని శ్రీరాజరాజేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీలక్ష్మీఅనంత పద్మనాభ స్వామివారికి పంచోపనిషత్ ద్వారా అభిషేకం, సాయంత్రం సదస్యం నిర్వహించారు. అలాగే శనిత్రయోదశి సందర్భంగా భీమేశ్వర ఆలయంలో భక్తులు శనీశ్వరుడికి పూజలు నిర్వహించారు.

రాజన్నను దర్శించుకున్న ప్రముఖులు..

రాజరాజేశ్వరస్వామిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కరీంనగర్ ఏసీపీ వెంకటస్వామి కుటుంబ సమేతంగా రాజన్న ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సినీ హీరో బాల ఆదిత్య, యాక్టర్ కౌశిక్‌లు దర్శించుకున్నారు. రాజన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించి కోడెమొక్కులు చెల్లించుకున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత

సిరిసిల్ల కలెక్టరేట్, మే 24 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత సూచించారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శనివారం సీజనల్ వ్యాధులపై జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బందితో సీజనల్ వ్యాధుల నివారణపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రజిత మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న సమయంలో ప్రబలే వ్యాధుల నుంచి ప్రజలను రక్షించేందుకు ముందు జాగ్రత్తగా రక్త నమూనాలను సేకరించి ఆర్‌డీటీ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేయాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లోని ఇళ్లలో ఐఆర్ఎస్‌ను స్ప్రే చేయించడం, ఇంటి అవరణలోని తొట్టిల్లో టైర్లలో, కూలర్లలో నీటి నిల్వలు లేకుండా ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డేను పాటించి దోమలు కుట్టకుండా జాగ్రత్తలు పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి రోజు రోజువారీ వివరాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేలోత్ తండాలో సీసీఎస్ పోలీసుల దాడులు

- నకిలీ విత్తనాలు అమ్ముతున్నారంటూ సమాచారం

- విచారణ చేపట్టిన వ్యవసాయ అధికారులు



విచారణ చేపడుతున్న వ్యవసాయ అధికారులు, పోలీసులు

వీర్నపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామ పరిధిలోని కేలోత్‌తండాలో నకిలీ వరి విత్తనాలు అమ్ముతున్నారంటూ సమాచారం రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీసీఎస్ పోలీసులు స్థానిక ఎస్సై ఎల్లయ్యగౌడ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఓ రైతు ఇంట్లో సుమారు 30 బస్తాల వరకు విత్తనాల సంచులు నిలువ ఉండడంతో పోలీసులు వ్యవసాయ అధికారులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న మండల వ్యవసాయ అధికారి జయ కుమారి అక్కడికి చేరుకొని విత్తనాల సంచులను పరిశీలించారు. పదిమంది రైతులను కలిసి సంచులను తీసుకొచ్చి వర్షాల కారణంగా ఒకచోట నిల్వ ఉంచామని అధికారులకు తెలిపారు. విత్తనాలకు సంబంధించిన బిల్లులను రైతులు చూపెట్టడంతో సంచుల లాట్ నంబర్‌ను పరిశీలించి నకిలీ విత్తనాలు కావని వ్యవసాయ అధికారులు నిర్ధారించారు. రైతులకు తక్కువ ధరలో అందిస్తున్న యజమానులను ఓర్వలేక నకిలీ విత్తనాలంటూ పుకార్లు సృష్టించారని రైతులు తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై రైతుల రాస్తారోకో



కొత్తపల్లిలో మొలకెత్తిన ధాన్యంతో రాస్తారోకో చేస్తున్న రైతులు

గంభీరావుపేట, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపల్లిలో ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై శనివారం రైతులు రాస్తారోకో చేపట్టారు. వర్షాలు పడుతుండటంతో వడ్లు మొలకెత్తుతున్నాయని, కొనుగోలు కేంద్రాలకు వడ్లు తెచ్చి నెలరోజులు దాటిందని, తక్షణమే కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు. మొలకెత్తిన ధాన్యంతో ప్రధాన రోడ్డుపై బైఠాయించడంతో రాకపోకలు స్థంబించిపోయాయి. తహసీల్దార్ మారుతిరెడ్డి అక్కడికి చేరుకుని, కొనుగోళ్లను మరింత వేగవంతం చేసి తడిసిన ధాన్యంతో పాటు మొలకెత్తిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ

ఎల్లారెడ్డిపేట, మే 24(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్, బాకురుపల్లితండాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు స్థానిక కాంగ్రెస్ నాయకులు శనివారం భూమిపూజ చేశారు. లక్ష్మారెడ్డి, రాజేందర్, రవీందర్, సత్తయ్య, శ్రీనివాస్, దేవేందర్, గోపాల్, మల్లేశం, కల్యాణ్, రాంసింగ్, బుచ్చాగౌడ్, రాములునాయక్, బాల్‌రెడ్డి, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొట్టిన క్రేన్

● ఒకరికి గాయాలు

శంకరపట్నం, మే 24 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం గొల్లపల్లి గ్రామ శివారులో శనివారం కరీంనగర్-వరంగల్ జాతీయరహదారిపై కారును క్రేన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒకరు గాయపడ్డారు. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. హనుమకొండకు చెందిన బెజ్జంప్రకాష్ అతడి కుమారుడు బెజ్జం సుధీర్ ఇద్దరు వేములవాడకు వెళ్లి దర్శనం చేసుకొని తిరిగివస్తున్నారు. ఈ క్రమంలో గొల్లపల్లి గ్రామశివారు దగ్గర ఎదురుగా వస్తున్న క్రేన్, కారును ఢీ కొట్టింది. ఈఘటనలో కారులో ప్రయాణిస్తున్న ప్రకాష్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న బ్లూకోల్ట్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని 108కు సమాచారం అందించారు. ప్రథమచికిత్స అందిస్తూ హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గీత కార్మికుడికి గాయాలు

హుజూరాబాద్‌రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన ఓ గీత కార్మికుడు శుక్రవారం రాత్రి తాటిచెట్టుపై నుంచి కిందపడి గాయపడ్డాడు. గ్రామానికి చెందిన బాలగోని రాములు వృత్తిలో భాగంగా కల్లు తీస్తున్న క్రమంలో మోకు జారి కిందపడ్డాడు. గమనించిన తోటి గీతకార్మికులు 108కు, కుటుంబసభ్యులకు సమాచారం అదించారు. చికిత్సనిమిత్తం రాములును హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

వేములవాడలో మూడిళ్లలో చోరీ

వేములవాడ, మే 24 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలోని సాయినగర్ ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మూడు ఇళ్లలో చోరీ జరిగింది. సాయినగర్ నుంచి బైపాస్ రోడ్డుకు వెళ్లే మార్గంలోని ఒక కిరాణా దుకాణం తాళం పగలగొట్టి లోనికి ప్రవేశించిన దొంగ ఐదు వేల రూపాయల నగదు అపహరించినట్లు తెలిసింది. పక్కనే ఉన్న మరో ఇంట్లో చీరల దుకాణం నిర్వహిస్తుండగా, ఆ ఇంట్లోకి ప్రవేశించిన దొంగ చీరలు ఎత్తుకువెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఒకరి ఇంట్లో రెండు తులాల బంగారం, మరొకరి ఇంట్లో ఒక తులం బంగారం చొప్పున ఎత్తుకు వెళ్లినట్లు వెల్లడించారు. ఇంట్లోని వారు తాళం వేసి ఊరికి వెళ్లినట్లు గమనించిన దొంగ ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వేములవాడ పట్టణంలోని మార్కండేయనగర్, సాయినగర్ ప్రాంతంలో వారంరోజులుగా వరుసగా దొంగతనాలు జరుగుతుండడంతో భయాందోళనలకు గురవుతున్నారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సాయినగర్‌లోని తాళం వేసిఉన్న మూడు ఇళ్లలో దొంగతనం జరిగిందని మొత్తం మూడుతులాల బంగారం, 5000 రూపాయల నగదు అపహరణకు గురైనట్లు ఫిర్యాదు అందిందని పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

జనరల్ స్టోర్‌లో చోరీ

శంకరపట్నం, మే 24 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఓ జనరల్ స్టోర్‌లో శనివారం చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంపేట గ్రామానికి చెందిన కారుకూరి శ్రీనివాస్ కేశవపట్నం పోలీస్‌స్టేషన్ సమీపంలో జనరల్ స్టోర్ నిర్వహిస్తున్నాడు. స్టోర్‌కు శుక్రవారం సాయంత్రం యథావిధిగా తాళం వేసి వెళ్లాడు. తెల్లవారుజామున పేపర్‌బాయ్ షాపు తెరిచి ఉందని శ్రీనివాస్‌కు సమాచారం అందించాడు. శ్రీనివాస్ షాపు వద్దకు వచ్చి చూడగా, క్యాష్ కౌంటర్‌లోని రూ.17వేల నగదు, రూ.20వేల విలువ చేసే జనరల్ స్టోర్ సామగ్రి, 5 హెల్మెట్‌లను దొంగలు దోచుకెళ్లినట్లు తెలిపారు. ఈ మేరకు కేశవపట్నం పోలీస్‌స్టేషన్లో శ్రీనివాస్ ఫిర్యాదు చేయగా, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి, వివరాలు నమోదు చేసుకున్నారు.

సరస్వతి పుష్కరం.. సకలజన హితం



గోదావరిలో దీపాలను వదులుతున్న భక్తులు



● త్రివేణి సంగమానికి పోటెత్తిన భక్తజనం

● పదో రోజు 2 లక్షలకుపైగా హాజరైన భక్తులు

కాళేశ్వరం, మే 24 (ఆంధ్రజ్యోతి): సరస్వతి పుష్కర సంబరం సాగుతోంది. సుదూర ప్రాంతాల నుంచి అశేష భక్తజనం కాళేశ్వర క్షేత్రానికి పోటెత్తుతున్నారు. శనివారం పదో రోజు వివిధ ప్రాంతాలనుంచి సుమారు 2 లక్షలపైచిలుకు భక్తులు కాళేశ్వరంలో పుష్కర స్నానాలు ఆచరించి ముక్తీశ్వరుడిని కృపకు పాత్రులయ్యారు. భక్తులు రద్దీ అధికమై దర్శనానికి గంటలకొద్దీ సమయం పట్టడంతో క్యూలైన్‌లో వేచిచూడలేని భక్తులు కొంత మంది పుష్కర స్నానాలతో సరిపెట్టుకొని వెనుదిరిగి వెళ్లారు. పార్కింగ్ స్థలాలు సుదూరంగా ఉండటంతో కొంత మంది వాహణదారులు ఇబ్బందులు పడ్డారు. పలువురు ప్రముఖుల కాళేశ్వర క్షేత్రాన్ని సందర్శించి పుష్కర స్నానమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆది, సోమ రెండు రోజులతో పుష్కరాలు ముగియనుండటంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చే ఛాన్స్ ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. సర్వసతి పుష్కరాల పదో రోజులో భాగంగా శనివారం పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఎన్‌పీడీసీఎల్ సీఅండ్ఎండీ ఐఏఎస్ అధికారి కృష్ణ భాస్కర్, సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి పుష్కర స్నానాలు ఆచరించారు. అనంతరం కాళేశ్వరాలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గడిచిన 10రోజుల్లోనే 10 లక్షల పైచిలుకు మంది భక్తజనం పుష్కర స్నానాలు ఆచరించారు. పుష్కరసాన్నం ఆచరించేందుకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు ఆదివారం రానున్నారు.



ఎడ్లబండ్లపై పుష్కర స్నానానికి వస్తున్న భక్తులు



కొండగట్టులో భక్తుల రద్దీ



ఆలయంలో భక్తులు

మల్యాల, మే 24 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో రద్దీగా మారింది. హనుమాన్‌జయంతి ఉత్సవాలు ముగిసినప్పటికీ వేలాదిగా వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకపూజలు, సత్యనారాయణ వ్రతాలుచేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాములవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు పర్యవేక్షించారు.

● పెద్ద జయంతి ఆదాయం రూ.1.51కోట్లు

కొండగట్టు అంజనేయస్వామి సన్నిధిలో ఈనెల 20నుంచి 22వరకు జరిగిన పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా దేవస్థానంకు రూ.1,51,72,470 ఆదాయం వచ్చినట్లు ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. దీక్ష విరమణ టికెట్ల ద్వారా రూ.30,56,100, కేశఖండనం టికెట్ల ద్వారా రూ.8,51,450, ప్రత్యేక దర్శనం రూ. 23,04,800 ఆదాయం వచ్చినట్లు ఈవో పేర్కొన్నారు. రూ.79,14,200ల లడ్డు విక్రయాలు, రూ.10,45,920ల పులిహోర విక్రయాలు జరిగినట్లు వివరించారు. ఇందులో లడ్డూ, పులిహోర విక్రయాలు ద్వారా వచ్చిన సొమ్ములు పూర్తి స్థాయిలో ఆదాయం కాకపోయిప్పటికీ అధికారులు ఆదాయంగా పేర్కొంటున్నారు. గతేడాది దేవస్థానానికి హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా రూ.1,51,38,490 ఆదాయం సమకూరింది.

డీడీఎన్ పథకానికి ముగిసిన గడువు

కరీంనగర్ కల్చరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడికరీంనగర్ జిల్లాలోని గ్రామీణప్రాంతాల్లో అర్హతకలిగిన దేవాలయాలకు దూపదీపనైవేద్య పథకం వర్తింపజేసేందుకు రాష్ట్రప్రభుత్వ దేవాదాయ ధర్మాదాయశాఖ మే1న నోటిఫికేషన్ జారీచేసింది. కాగా శనివారం సాయంత్రంతో ఈ దరఖాస్తుల సమర్పణకు గడువు ముగిసింది. సాయంత్రం 5గంటల వరకు సుమారు 300వరకు దరఖాస్తులు అందగా వాటిని ఉమ్మడిజిల్లా దేవాదాయశాఖ సహాయకమిషనర్‌తోపాటు అడిషనల్ కలెక్టర్, అర్చకసంఘం నుంచి ఒక వ్యక్తిని తీసుకొని త్రీమెన్‌కమిటీగా ఏర్పడిఆలయాలను ఎంపిక చేయనున్నారు. ఎన్నికైన ఆయాఆలయాలకు నెలకురూ.4వేలు ధూపదీప, నైవేద్యాలకు, అర్చక గౌరవభృతి కింద రూ.6వేలు చెల్లించనున్నారు. ఎంపిక విషయంలో పారదర్శకత పాటిస్తామని వదంతులు నమ్మవద్దని ఉమ్మడిజిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ నాయిని సుప్రియ తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. వృద్ధుడి మృతి

సిరిసిల్ల క్రైం, మే 24 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం పెద్దూరు గ్రామం సబ్‌స్టేషన్ వద్ద వద్ద శనివారం సాయంత్రం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నర్రా అలియాస్ గడ్డి బుచ్చయ్య(60) అనే వృద్ధుడు మృతిచెందాడు. సిరిసిల్ల పట్టణం సర్దాపూర్ 17వ బెటాలియన్‌లో పనిచేసే కానిస్టేబుల్ తన ద్విచక్ర వాహనంపై సిరిసిల్ల వైపు వెళుతుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనానికి ఢీకొనడంతో పెద్దూరుకు చెందిన బుచ్చయ్యకు తీవ్రగాయాలయ్యాయి. బుచ్చయ్యను 108 అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కాగా, పెద్దూరు గ్రామస్థులు ఆందోళన చేస్తారనే సమాచారం మేరకు జిల్లా ఆసుపత్రి పోస్టుమార్టం గది వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షల్లో ఏడుగురి డీబార్

గణేశ్‌నగర్, మే 24 (ఆంధ్రజ్యోతి): శాత వాహనవిశ్వవిద్యాలయం పరిధిలో కొనసాగు తున్న డిగ్రీ రెండోసెమిస్టర్ పరీక్షల్లో శనివారం మాల్ ప్రాక్టీస్ చేసిన ఏడుగురు విద్యార్థులను డీబార్ చేసినట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ వాగేశ్వరి డిగ్రీకళాశాల పరీక్ష కేంద్రంలో ఒకరు, అపూర్వ (ఉమెన్స్) డిగ్రీకళాశాలలో ఒకరు, అల్ఫోర్స్ (ఉమెన్స్) డిగ్రీకళాశాల కేంద్రంలో ఒకరు, పెద్దపల్లి ట్రినిటి డిగ్రీకళాశాలలో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు చొప్పున డీబార్ అయినట్లు వివరించారు.

తక్కువ మార్కులు వచ్చాయని విద్యార్థిని ఆత్మహత్య

ముస్తాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): పదోతరగతిలో తక్కువ మార్కులు వచ్చాయని మనస్తాపంచెందిన ఓవిద్యార్థిని ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన స్నేహిత(16) శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఇటీవల వెలువడిన పదోతరగతి ఫలితాల్లో తన స్నేహితుల కంటే తక్కువ మార్కులు వచ్చాయని కొద్దిరోజులుగా స్నేహిత బాధపడుతోంది. ఈక్రమంలో శనివారం తల్లిదండ్రులు పక్క ఊరిలోని బంధువుల ఇంటికి వెళ్లగా స్నేహిత ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ గణేష్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గన్నేరువరం, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారువెల్ల గ్రామంలో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపుదాడి చేసి తొమ్మిదిమందిని అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు పరారయ్యారు. వారి వద్ద నుంచి రూ.25,470 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో తొమ్మిది మంది జూదరులు పట్టుబడగా మరోముగ్గురు పారిపోయారు. పట్టుబడిన వారిని గన్నేరువరం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ గోపతి రవిందర్ తెలుపగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ప్రొబేషనరీ ఎస్ఐ అరుణ్ తెలిపారు.

ఖాసింపేట విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద పిడుగుపాటు

●స్వల్పంగా ధ్వంసమైన ఎల్‌టీ విద్యుత్‌పరికరాలు, ప్యానెల్ బోర్డు


గన్నేరువరం, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం అర్ధరాత్రి ఉరుములు మెరుపులతో కురిసిన భారీ వర్షంతో పాటు ఖాసింపేటలోని విద్యుత్‌సబ్‌స్టేషన్ సమీపంలో చింతచెట్టుపై భారీ శబ్దంతో పిడుగు పడింది. పిడుగుపాటుకు సబ్‌స్టేషన్‌లోని ఎల్‌టీ లైన్, అలారం ప్యానెల్ బోర్డు ధ్వంసం అయ్యాయి. దీంతో అర్ధరాత్రినుంచి గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శనివారం ఉదయం హుటాహుటిన విద్యుత్‌అధికారులు రంగంలోకి దిగినూతన ప్యానెల్‌బోర్డు, ఎల్‌టీలను ఏర్పాటు చేశారు. సమాచారం అందుకున్న జిల్లా విద్యుత్ అధికారులు ఎస్‌సి రమేష్‌బాబు, డీఈ తిరుపతి, మండల ఏఈ ఆంజనేయులు సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు.

మధ్యాహ్నం ఒంటిగంటవరకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. సకాలంలో స్పందించి విద్యుత్‌ను పునరుద్ధరించిన విద్యుత్ అధికారులను గ్రామస్థులు, రైతులు అభినందించారు.

పిడుగుపాటుతో ఎద్దులు మృతి

గంగాధర, మే 24 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం కాచిరెడ్డిపల్లిలో శనివారం ఉదయం పిడుగుపడి రెండు ఎడ్లు మృతిచెందాయి. గ్రామానికి చెందిన దెశెట్టి వీరమల్లయ్య కాడెద్దులతో వ్యవసాయం చేస్తుంటాడు. శుక్రవారం సాయంత్రం రెండు పశువులను రేకుల షెడ్డు వద్ద ఎప్పటిలాగే కట్టేశాడు. శనివారం వేకువజామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంలో షెడ్డుపై పిడుగువేసింది. దీంతో షెడ్డులో కట్టేసిన రెండు పశువులు అక్కడికక్కడే మృతిచెందాయి. ఉదయం షెడ్డు వద్దకు వెళ్లిన రైతు వీరమల్లయ్య మృతి చెందిన పశువులను చూసి బోరున విలపించాడు. పశువుల విలువ సుమారు 1.50లక్షలు ఉంటుందని గ్రామ రైతులు తెలిపారు.

● అవయవాల ఎదుగుదలలో ముఖ్య పాత్ర
● నేడు థైరాయిడ్ డే



జీవక్రియ నియంత్రణలో కీలకం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

మానవ శరీరంలో రసాయన జీవక్రియలను నియంత్రిచండంలో థైరాయిడ్ గ్రంథి ఎంతో కీలకమైంది. మనిషి పుట్టినప్పటి నుంచి మరణించే వరకు శరీర మార్పులు చేయడంలో, అవయవాల ఎదుగుదలలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. అయితే ప్రస్తుతం థైరాయిడ్ సమస్య ప్రపంచాన్ని పట్టి పీడిస్తోంది. అన్ని దేశాల్లోనూ ప్రజలు థైరాయిడ్ సమస్యతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తించి అవగాహన పెంచడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ మే 25న థైరాయిడ్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. థైరాయిడ్‌లో ఉండే కణాలు రక్తం నుంచి అయోడిన్‌ను గ్రహించి టైరోసిస్ అనే అమైనో యాసిడ్‌తో పాటు మరికొన్ని ఎంజైమ్‌ల సహాయంతో థైరాయిడ్ హార్మోన్లు టి3, టి4 వంటివి ఉత్పత్తి చేస్తాయి. ఈ టి3, టి4 హార్మోన్ల ఉత్పత్తిని నియంత్రించడానికి పిట్యూటరీ అనే గ్రంథి థైరాయిడ్ సిమ్యూలేటివ్ అనే హార్మోన్‌ను విడుదల చేస్తుంది. ఈ థైరాయిడ్ టి3, టి4 హార్మోన్లు శరీరంలోని కొన్ని ప్రధానమైన జీవక్రియ జరిగేందుకు దోహదపడుతుంది. మన శరీరాన్ని చురుకుగా ఉంచడానికి తోడ్పడుతుంది. టి3, టి4 రక్తంలో హార్మోన్ల మోతాదు తగ్గితే కొన్ని సంకేతాలు పిట్యూటరీ గ్రంథికి చేరి అక్కడినుంచి టిఎస్‌హెచ్ హార్మోన్ ఎక్కువగా విడుదలయ్యేలా చేస్తుంది. దానివల్ల రక్తంలో టీఎస్‌హెచ్ మోతాదు పెరుగుతుంది. అప్పుడు రక్తంలో టి3, టి4 హార్మోన్ల మోతాదు పెరిగితే పిట్యూటరీ గ్రంథి నుంచి వచ్చే టీఎస్‌హెచ్ మోతాదు తగ్గుతుంది. దీంతో ఆ గ్రంథికి సంబంధించిన సమస్య వస్తుంది.

పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు రావచ్చు...

\- డాక్టర్ ఎ జైలొసింగ్(ఎండీ)



మానవ జీవక్రియల నియంత్రణలో కీలకపాత్ర పోషించే థైరాయిడ్ సమస్య వచ్చిందని పరీక్షల ద్వారా తెలుసుకొని మందులు వాడడం చాలా మంచిది. అశ్రద్ధ చేస్తే జీవక్రియలన్నీ సక్రమంగా పనిచేయవు. వైద్యుల సలహా మేరకు మందులు వాడడమే శ్రేయస్కరం. థైరాయిడ్ పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు రావచ్చు. తల్లికి ఉంటే బిడ్డకు కూడా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పుట్టిన వెంటనే తల్లికి ఉన్నట్లయితే థైరాయిడ్ పరీక్షలు చేసి చికిత్సలు ప్రారంభిస్తే ఫలితం ఉంటుంది. లేదంటే పిల్లల్లో ఎదుగుదల మెదడు ఎదగకపోవడం వంటి సమస్యలు వస్తాయి. పెద్దవాళ్లు కూడా రకరకాల సమస్యలను ఎదుర్కొంటారు. నిరంతరం మందులు వాడడం మంచిది.

● థైరాయిడ్ సమస్యలు రెండు రకాలు..

హార్మోన్లు తగ్గడాన్ని హైపో థైరాయిడిజం అని, అవసరాన్ని మించి ప్రసవించడాన్ని హైపర్ థైరాయిడిజం అని లేదా థైరోట్యాక్సికోసిస్ అంటారు. హైపో థైరాయిడిజానికి అయోడిన్ లోపం సమస్య, హైపర్ థైరాయిడిజానికి రక్తంలో థైరాయిడ్ గ్రంథి యాంటీ బాడీస్ ఏర్పడడం. దీనిని హైపో ఇమ్యూన్ హైపోథైరాయిడిజం అంటారు. వీటిని రక్త పరీక్ష ద్వారా గుర్తిస్తారు.

దోపిడీ కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, మే 24 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం బద్దిపెల్లివద్ద శుక్రవారం మహిళను బెదిరించి ఆమె వద్ద నుంచి 4 వేల రూపాయలు దోచుకున్న ఘటనలో నిందితుడు సందీప్‌ను శనివారం అరెస్టు చేశామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మహిళ నడుచుకుంటూ వెళ్తుండగా ఆమెను చంపుతానని బెదిరించి రూ.4వేలు బలవం తంగా తీసుకొని సందీప్ పారిపోయినట్లు చెప్పారు.

చింతకుంట చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలో సందీప్‌ను ఎస్సై సాంబమూర్తి అరెస్టు చేసినట్లు, రూ.3,500నగదు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ మృతి

ఎల్లారెడ్డిపేట, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాపూర్ గ్రామశివారులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని మహిళ(40) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ప్రొబేషనరీ ఎస్ఐ లక్ష్మణ్ శనివారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. వెంకటాపూర్ గ్రామ శివారులో మహిళ రోడ్డు దాటుతున్న క్రమంలో ఈనెల23న రాత్రి ఎల్లారెడ్డిపేట నుంచి సిరిసిల్ల వైపు స్కూటీపై వెళుతున్న వ్యక్తి ఢీకొట్టాడు. తీవ్రగాయాల పాలైన మహిళను స్థానికులు సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్సపొందుతూ శనివారం మృతిచెందింది. మహిళ ఒంటిపై గులాబీరంగు నైటీ, ఆమె రెండు చేతులపై హిందీలో 'బీ మాతా' అని పచ్చబొట్టు ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ప్రొబేషనరీ ఎస్ఐ లక్ష్మణ్ పేర్కొన్నారు. మహిళను ఎవరైనా గుర్తిస్తే తమను సమాచారం అందించాలని ఆయన కోరారు.



ఫైనల్‌కు శ్రీకాంత్

మలేసియా మాస్టర్స్

కౌలాలంపూర్: ఎన్నాళ్లకెన్నాళ్లకు.. అప్పుడెప్పుడో 2019లో ఇండియా ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన తెలుగు షట్లర్ కిడాంబి శ్రీకాంత్ ఆరేళ్ల తర్వాత ఓ బీడబ్ల్యూఎఫ్ టూర్ ఈవెంట్‌లో ఫైనల్‌కు చేరాడు. ఫామ్‌లేమికి చెక్ పెడుతూ, తన జోరు కొనసాగిస్తూ కిడాంబి.. మలేసియా మాస్టర్స్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్‌ఫైట్‌కు దూసుకెళ్లాడు. శనివారం ఇక్కడ జరిగిన సింగిల్స్ సెమీఫైనల్లో 32 ఏళ్ల శ్రీకాంత్ 21-18, 24-22తో జపాన్‌కు చెందిన యుషి తనకను ఓడించాడు. ఆదివారం జరిగే తుదిపోరులో చైనా షట్లర్ లి షి ఫెంగ్‌తో శ్రీకాంత్ అమీతుమీ తేల్చుకోనున్నాడు.

పంజాబ్‌కు పంచ్

విజయంతో ఢిల్లీ బైబై


సమీర్ రిజ్వీ (58 నాటౌట్)

రాణించిన సమీర్ రిజ్వీ • ముస్తాఫిజుర్‌కు 3 వికెట్లు

జైపూర్: టాప్-2లో నిలిచేందుకు పోటీపడుతున్న జట్లకు వరుసగా మూడో రోజూ ప్రతికూల ఫలితమే ఎదురైంది. గుజరాత్, బెంగళూరు తరహాలోనే తాజాగా పంజాబ్ కింగ్స్‌కు పంచ్ పడింది. ఇప్పటికే ప్లేఆఫ్స్ నుంచి తప్పుకొన్న ఢిల్లీ క్యాపిటల్స్ తమ చివరి లీగ్ మ్యాచ్‌లో అదరగొట్టింది. అగ్రస్థానంపై కన్నేసిన పంజాబ్‌పై శనివారం జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో నెగ్గింది. తద్వారా 15 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచింది. భారీ ఛేదనలో సమీర్ రిజ్వీ (25 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లతో 58 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 206 పరుగులు చేసింది. శ్రేయాస్ అయ్యర్ (34 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 53), స్టొయినిస్ (16 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 44 నాటౌట్), ఇన్‌గ్లిస్ (12 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 32) రాణించారు. ముస్తాఫిజుర్‌కు 3.. విప్రజ్, కుల్దీప్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ఢిల్లీ 19.3 ఓవర్లలో 4 వికెట్లకు 208 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు రాహుల్ (35), డుప్లెసి (23) తొలి వికెట్‌కు 55 పరుగులు జోడించారు. ఆ తర్వాత కరుణ్ నాయర్ (44) భారీ షాట్లతో విరుచుకుపడగా.. డెత్ ఓవర్లలో సమీర్ రిజ్వీ పంజాబ్ బౌలర్లను ఆడుకున్నాడు. అతడికి స్టబ్స్ (18 నాటౌట్) సహకరించడంతో ఢిల్లీ ఎలాంటి ఒత్తిడికి గురికాలేదు. చివరి ఓవర్‌లో 8 పరుగులే అవసరమవగా, రిజ్వీ సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించాడు. హర్‌ప్రీత్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సమీర్ రిజ్వీ నిలిచాడు.

స్టొయినిస్ ధనాధన్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ శ్రేయాస్ నిలకడతో పాటు ఆఖర్లో స్టొయినిస్ జోరుతో జట్టు 200 దాటింది. ఓపెనర్ ప్రియాన్ష్ (6) విఫలమైనా ప్రభ్‌సిమ్రన్-ఇన్‌గ్లిస్ జోడీ చెలరేగింది. ఆరో ఓవర్‌లో 6,4 బాది ఇన్‌గ్లిస్ అవుటైనా పవర్‌ప్లేలో జట్టు 60/2 స్కోరు సాధించింది. రెండో వికెట్‌కు వీరు 47 పరుగులు జత చేశారు. విప్రజ్ బౌలింగ్‌లో స్కూప్ షాట్‌కు వెళ్లి ప్రభ్‌సిమ్రన్ బౌల్డయ్యాక ఆటలో కాస్త వేగం తగ్గింది. అయితే శ్రేయాస్ అర్ధసెంచరీతో జట్టును ఆదుకున్నాడు. నేహల్ (16), శశాంక్ (11) విఫలమైనా కెప్టెన్‌కు స్టొయినిస్ సహకరించాడు. 17వ ఓవర్‌లో అతడి 6,6,4.. శ్రేయాస్ 4తో 25 పరుగులు వచ్చాయి. కానీ కుల్దీప్ ఒకే ఓవర్‌లో శ్రేయాస్, అజ్మతుల్లా (1) వికెట్లు తీశాడు. అయినా 19వ ఓవర్‌లో మరోసారి చెలరేగిన స్టొయినిస్ 6,4,4,6తో 22 రన్స్ రాబట్టాడు. ముస్తాఫిజుర్ ఆఖరి ఓవర్‌లో పది పరుగులే ఇచ్చి జాన్సెన్ (0)ను అవుట్ చేశాడు.

స్కోరుబోర్డు

పంజాబ్: ప్రియాన్ష్ (సి) స్టబ్స్ (బి) ముస్తాఫిజుర్ 6, ప్రభ్‌సిమ్రన్ (బి) విప్రజ్ 28, ఇంగ్లిస్ (స్టంప్డ్) స్టబ్స్ (బి) విప్రజ్ 32, శ్రేయాస్ (సి) మోహిత్ (బి) కుల్దీప్ 53, నేహల్ (సి) డుప్లెసి (బి) ముకేశ్ 16, శశాంక్ (సి) స్టబ్స్ (బి) ముస్తాఫిజుర్ 11, స్టొయినిస్ (నాటౌట్) 44, అజ్మతుల్లా (సి) రిజ్వీ (బి) కుల్దీప్ 1, జాన్సెన్ (సి) స్టబ్స్ (బి) ముస్తాఫిజుర్ 0, హర్‌ప్రీత్ (నాటౌట్) 7, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 206/8, వికెట్ల పతనం:** 1-8, 2-55, 3-77, 4-118, 5-144, 6-172, 7-174, 8-197; బౌలింగ్: ముకేశ్ 4-0-49-1, ముస్తాఫిజుర్ 4-0-33-3, మోహిత్ శర్మ 4-0-47-0, విప్రజ్ 4-0-38-2, కుల్దీప్ 4-0-39-2.

ఢిల్లీ: రాహుల్ (సి) శశాంక్ (బి) జాన్సెన్ 35, డుప్లెసి (సి) ప్రియాన్ష్ (బి) హర్‌ప్రీత్ 23, కరుణ్ నాయర్ (బి) హర్‌ప్రీత్ 44, అటల్ (సి) అర్ష్‌దీప్ (బి) ప్రవీణ్ దూబే 22, సమీర్ రిజ్వీ (నాటౌట్) 58, స్టబ్స్ (నాటౌట్) 18, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 19.3 ఓవర్లలో 208/4; వికెట్ల పతనం:** 1-55, 2-65, 3-93, 4-155; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-35-0, అజ్మతుల్లా 4-0-46-0, హర్‌ప్రీత్ బ్రార్ 4-0-41-2, జాన్సెన్ 4-0-41-1, ప్రవీణ్ దూబే 2-0-20-1, స్టొయినిస్ 1.3-0-21-0.

నేటి మ్యాచ్‌లు

గుజరాత్ x చెన్నై — మ.3.30 నుంచి — వేదిక: అహ్మదాబాద్

హైదరాబాద్ x కోల్‌కతా — రా.7.30 నుంచి — వేదిక: ఢిల్లీ

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	13	9	4	0	18	0.602
పంజాబ్	13	8	4	1	17	0.327
బెంగళూరు	13	8	4	1	17	0.255
ముంబై	13	8	5	0	16	1.292
ఢిల్లీ	14	7	6	1	15	0.011
లఖ్‌నవూ	13	6	7	0	12	-0.337
కోల్‌కతా	13	5	6	2	12	0.193
హైదరాబాద్	13	5	7	1	11	-0.737
రాజస్థాన్	14	4	10	0	8	-0.549
చెన్నై	13	3	10	0	6	-1.030

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

టెస్టుల్లో కొన్నేళ్లుగా జట్టుకు మూలస్తంభాలుగా ఉన్న రోహిత్, కోహ్లీ ఒక్కసారిగా గుడ్‌బై చెప్పడంతో.. సంధి దశలో ఉన్న టీమిండియాను నడిపించే నవతరం నాయకుడిగా శుభ్‌మన్ గిల్ సరికొత్త అధ్యాయానికి నాంది పలకనున్నాడు. యువ సారథిగా భవిష్యత్ భారత జట్టును నిర్మించనున్నాడు. ఇంగ్లండ్ టూర్‌లో గిల్ నూతన ప్రస్థానం ఆరంభం కానుంది. ఐపీఎల్‌లో అదరగొడుతున్న సాయి సుదర్శన్, అర్ష్‌దీప్ సింగ్‌లకు తొలిసారి రెడ్‌బాల్ జట్టులో చోటు దక్కింది. దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారిస్తున్న కరుణ్ నాయర్‌కు ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు.



నవతరం నాయకుడు వచ్చాడు

శుభ్‌మన్ గిల్‌కే టెస్టు జట్టు పగ్గాలు

సుదర్శన్, అర్ష్‌దీప్‌కు పిలుపు

- వైస్ కెప్టెన్‌గా రిషభ్ పంత్
- బుమ్రా ఆడేది కొన్ని మ్యాచ్‌లే
- ఫిట్‌నెస్ లేమితో షమి అవుట్


అర్ష్‌దీప్
సుదర్శన్

ముంబై: రోహిత్ శర్మ రిటైర్మెంట్ తర్వాత జట్టు పగ్గాలు అందుకొనేది ఎవరనే సస్పెన్స్‌కు తెరపడింది. ఊహాగానాలకు తగినట్టుగానే భారత టెస్టు జట్టు కొత్త కెప్టెన్‌గా 25 ఏళ్ల శుభ్‌మన్ గిల్‌ను బీసీసీఐ ఎంపిక చేసింది. వచ్చేనెల 20 నుంచి జరిగే ఐదు టెస్టుల సిరీస్ కోసం ఇంగ్లండ్‌లో పర్యటించే టీమిండియాను శనివారం సెలెక్టర్లు ప్రకటించారు. డాషింగ్ బ్యాటర్, 27 ఏళ్ల రిషభ్ పంత్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. రోహిత్, కోహ్లీ రిటైర్మెంట్ తర్వాత సంధి దశలో ఉన్న భారత జట్టుకు అంతగా అనుభవం లేని 18 మంది సభ్యుల జట్టును సెలెక్టర్లు ఎంపిక చేసి ఒకరకంగా సాహసమే చేశారు. 32 టెస్టులు ఆడిన గిల్ 35.05 సగటుతో 1893 పరుగులు చేశాడు. కాగా, ఈ పర్యటన నుంచి పెద్దగా ఆశిస్తున్నదేమీ లేని నేపథ్యంలో గిల్ సాధించే అనుభవం భవిష్యత్‌లో ఉపయోగపడుతుందని సెలెక్టర్లు చెబుతున్నారు. 'ఏడాది క్రితమే గిల్‌పై దృష్టిసారించాం. భవిష్యత్‌లో భారత జట్టును నడిపించగల సామర్థ్యం అతడిలో ఉందని భావించాం' అని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ అన్నాడు. కాగా, సుదీర్ఘ సిరీస్‌కు ఫిట్‌గా ఉండడన్న కారణంతో సీనియర్ పేసర్ మహ్మద్ షమిని జట్టు నుంచి తప్పించారు. అయితే, వైద్యుల సూచనల మేరకు షమిని పరిగణనలోకి తీసుకోలేదని అగార్కర్ తెలిపాడు. అతడి స్థానంలో ఐపీఎల్‌లో అదరగొ డుతున్న అర్ష్‌దీప్ సింగ్‌ను తొలిసారి టెస్టులకు ఎంపిక చేసినట్టు చెప్పా డు. 'ఐపీఎల్ సందర్భంగా గతవారం గాయానికి గురైన షమి ఇటీవలే ఎంఆర్ఐ స్కాన్ తీయించుకొన్నాడు. అయితే, సిరీస్‌కు అతను ఫిట్‌గా ఉండడని వైద్యులు తేల్చారు' అని అగార్కర్ తెలిపాడు. మొత్తంగా టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ (2025-27) కోసం భారత జట్టు నిర్మాణం ఇంగ్లండ్ సిరీస్‌తో ఆరంభమవుతుంది. గిల్ భారత టెస్టు జట్టుకు 37వ కెప్టెన్.

ఇంగ్లండ్ టూర్‌కు భారత జట్టు

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), పంత్ (వైస్ కెప్టెన్, వికెట్ కీపర్), యశస్వి జైస్వాల్, రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీశ్ కుమార్, జడేజా, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, అర్ష్‌దీప్, కుల్దీప్ యాదవ్.



నాయర్.. 8 ఏళ్ల తర్వాత

రోహిత్, కోహ్లీ స్థానాల్లో సాయి సుదర్శన్, కరుణ్ నాయర్ జట్టులోకొచ్చారు. ఈ ఐపీఎల్‌లో పరుగుల వరదపారిస్తున్న గుజరాత్ బ్యాటర్ సాయి సుదర్శన్‌కు తొలిసారి పిలుపు అందగా.. ఎనిమిదేళ్ల తర్వాత కరుణ్ రీఎంట్రీ ఇచ్చాడు. ఈ ఐపీఎల్‌లో సుదర్శన్ 638 రన్స్ చేసి టాప్‌స్కోరర్‌గా ఉన్నాడు. ఇక, నాయర్ చివరిసారిగా 2017లో టెస్టు ఆడాడు. సెహ్వాగ్ తర్వాత టీమిండియాలో ట్రిపుల్ సెంచరీ సాధించిన ఆటగాడిగా రికార్డులకెక్కిన కరుణ్.. ఆ తర్వాత అంతగా ఆకట్టుకోలేకపోయాడు. కానీ, దేశవాళీలో మెరుగైన ప్రదర్శనతో సెలెక్టర్ల తలుపులు తడుతూనే ఉన్నాడు. అయితే కోహ్లీ రాజీనామాతో నాయర్‌కు అదృష్టం కలిసొచ్చింది. పేసర్ హర్షిత్ రాణా, బ్యాటర్లు శ్రేయాస్ అయ్యర్, సర్ఫరాజ్ ఖాన్‌లకు జట్టులో చోటు దక్కలేదు. అయితే, సర్ఫరాజ్‌కంటే అనుభవజ్ఞుడైన నాయర్‌కు సెలెక్టర్లు ఓటేశారు. ఆస్ట్రేలియా టూర్‌లో ఆడిన దేవ్‌దత్ పడిక్కల్ ఫిట్‌నెస్ సమస్యలతో చోటు కోల్పోయాడు.



5

పిన్న వయసులో భారత టెస్టు జట్టు సారథిగా ఎంపికైన ఐదో ఆటగాడు గిల్ (25 ఏళ్ల 258 రోజులు). మన్సూర్ అలీఖాన్ పటౌడి (21 ఏళ్లు), సచిన్ (23 ఏళ్లు), కపిల్ దేవ్ (24 ఏళ్లు), రవిశాస్త్రి (25 ఏళ్ల 229 రోజులు).. గిల్ కంటే ముందున్నారు.



బుమ్రాకు ఎందుకు వద్దంటే..?

కెప్టెన్సీ కోసం గిల్‌తోపాటు బుమ్రా పేరు గట్టిగానే వినిపించింది. అయితే, ఫిట్‌నెస్ ఇబ్బందుల కారణంగానే బుమ్రాకు జట్టు పగ్గాలు అప్పగించలేదు. అసలు సిరీస్‌లోని ఐదు టెస్ట్‌లకు బుమ్రా అందుబాటులో ఉండడం కష్టమేనని అగార్కర్ అన్నాడు. బుమ్రాపై పని ఒత్తిడి భారం పడకుండా చూడాలని ఫిజియో, వైద్యులు సూచించారు. ఈ క్రమంలో బుమ్రా రెండు, మూడు టెస్టులకే అందుబాటులో ఉండే అవకాశాలున్నాయని అగార్కర్ పేర్కొన్నాడు. రిజర్వ్ ఓపెనర్‌గా అభిమన్యు ఈశ్వరన్‌ను ఎంపిక చేశారు. అయితే, బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ సామర్థ్యంపై సందేహాలుండడంతో.. శార్దూల్ ఠాకూర్‌కు కూడా జట్టులో చోటిచ్చారు. శార్దూల్ చివరిగా 2023లో టెస్టు ఆడాడు. గత ఇంగ్లండ్ పర్యటనలో ఓవల్ టెస్ట్‌లో శార్దూల్ వరుసగా అర్ధ శతకాలు బాదడంతో భారత్ గెలిచిన సంగతి తెలిసిందే.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

టెస్టుల్లో రోహిత్ వారసుడిగా 25 ఏళ్ల శుభ్‌మన్ గిల్‌కు టెస్టు పగ్గాలు అప్పగించారు. భారత క్రికెట్‌కు వెన్నెముకగా నిలిచిన విరాట్, రోహిత్ దూరమైన వేళ ఈ సంధి దశను అధిగమించేందుకు బీసీసీఐ ఈ యువ ఆటగాడిపై భరోసా ఉంచడం విశేషమే. అరంగేట్రం చేసిన ఐదేళ్లకే కెప్టెన్‌గా అందలం దక్కడంతో గిల్ కెరీర్ గ్రాఫ్‌ను నెటిజన్లు కొనియాడుతున్నారు. 2018 అండర్-19 వరల్డ్‌కప్‌లో పాకిస్థాన్‌పై సెంచరీతో గిల్ అందరి

ఇక 'శుభ్' ఆరంభం!

దృష్టినీ ఆకర్షించాడు. అప్పటి కోచ్ ద్రవిడ్ పట్టుబట్టి మరీ గిల్‌ను జట్టులోకి తీసుకున్నాడు. ఆ తర్వాత ఇంగ్లండ్ టూర్‌లో ఇండియా 'ఎ' తరఫున రాణించాడు. అలాగే వెస్టిండీస్ 'ఎ'తో జరిగిన టెస్టులో డబుల్ సెంచరీతో వెనుదిరిగి చూడలేదు. చక్కటి టెక్నిక్, టెంపర్‌మెంట్ కలిగిన బ్యాటింగ్ కారణంగా 2019లోనే వన్డే జట్టులోకొచ్చాడు. అయితే గిల్ సక్సెస్ వెనుక అతడి తండ్రి లఖ్విందర్ కృషి ఎనలేనిది. కొడుకు ధ్యాసంతా క్రికెట్‌పైనే ఉండేందుకు తమ గ్రామం నుంచి మొహాలీకి మకాం మార్చాడు. కొన్నేళ్లపాటు బంధువుల వివాహాలకు కూడా హాజరుకాలేదట. అప్పటి త్యాగాలకు ప్రస్తుతం ఘనమైన ప్రతిఫలమే దక్కింది. పాతికేళ్ల వయస్సులోనే సుదీర్ఘ ఫార్మాట్‌లో జట్టును నడిపించే స్థాయికి ఎదిగాడు. మరోవైపు ఈ ప్రయాణం సవాళ్లతో కూడుకున్నదే అయినా.. భారత టెస్టు జట్టు గిల్ ఆధ్వర్యంలో శుభ్ ఆరంభంగా కొనసాగాలని ఆశిద్దాం.



ఆ ఇద్దరి లోటు పూడ్చలేనిది: అగార్కర్

జట్టులో రోహిత్, కోహ్లీ లేని లోటును పూడ్చడం కష్టమేనని అగార్కర్ అన్నాడు. కానీ, రాబోయే ఇంగ్లండ్ టూర్‌లో మిగతా ఆటగాళ్లు ఆ బాధ్యతలు అందుకొంటారని ఆశిస్తున్నట్టు చెప్పాడు. ఈ నెల 7న రోహిత్ రిటైర్మెంట్ ప్రకటించగా.. 12న కోహ్లీ టెస్టుల నుంచి వైదొలుగుతున్నట్టు బాంబ్ పేల్చాడు. అయితే, చాంపియన్స్ ట్రోఫీ తర్వాత గత నెలలోనే తాను టెస్టు క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాలనుకొంటు న్నట్టు కోహ్లీ తనకు చెప్పాడని అగార్కర్ తెలిపాడు.

'25' వేటలో జొకో!

సోనీ లివ్‌లో మ. 2.30 నుంచి

- నేటి నుంచి ఫ్రెంచ్ ఓపెన్
- ఫేవరెట్లుగా అల్కారజ్, సిన్నర్



పారిస్: క్లేకోర్ట్ రారాజు రఫెల్ నడాల్ రిటైర్మెంట్ తర్వాత జరుగుతున్న తొలి ఫ్రెంచ్ ఓపెన్‌లో యువ హవా నడవనుంది. డిఫెండింగ్ చాంప్ కార్లోస్ అల్కరజ్, జానిక్ సిన్నర్ మధ్యే ప్రధాన పోటీ ఉంటుందనే అంచనాలున్నాయి. ఆదివారం నుంచి జరిగే టోర్నీలో సిన్నర్ టాప్ సీడ్‌గా బరిలోకి దిగుతున్నాడు. ఇక, రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ వేటలో ఉన్న సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్.. రోలాండ్ గారోస్‌లోనే ఆ ఫీట్ పూర్తిచేయాలనుకొంటున్నాడు. అయితే, ఆరోసీడ్ జొకోవిచ్, సిన్నర్ ఒకే పార్శ్వంలో ఉండడంతో సెమీస్‌లో ఇద్దరూ తలపడే చాన్సుంది. తొలి రౌండ్‌లో మెకెంజీతో జొకో, ఆర్థర్ (ఫ్రాన్స్)తో సిన్నర్ తలపడనున్నారు. క్వాలిఫయర్ జిప్పరీ (ఇటలీ)తో అల్కారజ్ ఆడనున్నాడు. మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ సబలెంక ఫేవరెట్ కాగా... మూడుసార్లు డిఫెండింగ్ చాంప్ స్వియటెక్, గతేడాది రన్నరప్ పౌలినీ, రెండో సీడ్ కొకో గాఫ్ టైటిల్ రేసులో ఉన్నారు.

షూటర్ ముకేశ్‌కు కాంస్యం

సుహ్లా (జర్మనీ): జూనియర్ షూటింగ్ ప్రపంచకప్‌లో గుంటూరు షూటర్ నేలవల్లి ముకేశ్ కాంస్య పతకం కొల్లగొట్టాడు. 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్‌లో ముకేశ్ మూడోస్థానంలో నిలిచాడు. మరో భారత షూటర్ నరేన్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో కాంస్యం నెగ్గాడు.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్ విజయం

నాటింగ్‌హామ్: జింబాబ్వేతో ఏకైక టెస్టులో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 45 పరుగుల తేడాతో గెలిచింది. తొలి ఇన్నింగ్స్‌ను ఇంగ్లండ్ 565/6 వద్ద డిక్లేర్ చేసింది. కాగా, జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 265 పరుగులకే ఆలౌటై ఫాలోఆన్‌లో పడింది. ఆటకు మూడో రోజైన శనివారం ఓవర్‌నైట్ స్కోరు 30/2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన జింబాబ్వే 255 రన్స్‌కు కుప్పకూలింది.

ఖరీదైన బహుమతులు వచ్చాయా...



ఐటీ రిటర్నుల్లో వెల్లడించాల్సిందే..

భారతీయ సమాజంలో బహుమతులు (గిఫ్ట్) ఒక భాగం. పెళ్లిళ్లు, పేరంటాలు, పండగల సమయంలో బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం మన సంప్రదాయం కూడా. ఇవి నగనట్రా, ఆస్తులు లేదా ఇతర విలువైన వస్తువుల రూపంలో ఉంటాయి. ఈ బహుమతులు తీసుకోవటం సంతోషం కలిగించినా.. ఒక ఆర్థిక సంవత్సరంలో అందుకున్న బహుమతుల విలువ రూ.50,000 మించితే వాటిపై పన్ను పోటు తప్పదు. ఐటీ రిటర్నులు సమర్పించేటప్పుడు విలువతో సంబంధం లేకుండా ఈ బహుమతుల వివరాలు వెల్లడించడం మంచిది. లేకపోతే భవిష్యత్‌లో సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది.

1958లోనే బహుమతులపై పన్ను కోసం ప్రభుత్వం గిఫ్ట్ ట్యాక్స్ యాక్ట్ తీసుకొచ్చింది. 1998లో ఈ చట్టాన్ని రద్దు చేశారు. అయితే 2004లో మళ్లీ బహుమతులను ఆదాయ పన్ను (ఐటీ) చట్ట సవరణ ద్వారా పన్నుల పరిధిలోకి తీసుకొచ్చారు. ఐటీ చట్టంలోని సెక్షన్ 56 ప్రకారం నిర్ణీత విలువ దాటిన బహుమతులు 'ఇతర ఆదాయం' కింది పరిగణించి వాటిని అందుకున్న వ్యక్తుల నుంచి పన్ను వసూలు చేస్తారు.

వీరికి మినహాయింపు: ఐటీ చట్టంలో పేర్కొన్న దగ్గరి బంధువులు, కుటుంబసభ్యుల నుంచి అందే బహుమతులకు విలువతో సంబంధం లేకుండా పూర్తి పన్ను మినహాయింపు లభిస్తుంది.

ఇతరుల నుంచి వస్తే: ఎవరైనా ఒక వ్యక్తికి ఒక ఆర్థిక సంవత్సరంలో బంధువులు కాని వ్యక్తుల నుంచి రూ.50,000 కంటే ఎక్కువ విలువైన బహుమతులు అందితే వారిపై పన్ను పోటు తప్పదు. దీన్ని ఇతర ఆదాయంగా పరిగణించి పన్ను విధిస్తారు.

ఎవరు బంధువులు: ఐటీ చట్టం ప్రకారం తల్లిదండ్రులు, తోబుట్టువులు, జీవిత భాగస్వాములు, వారి తల్లిదండ్రులు, తోబుట్టువులు, పిల్లలు, తాతలు, అమ్మమ్మలు, నాయనమ్మలు, మనవళ్లు, మనవరాళ్లు దగ్గరి బంధువుల పరిధిలోకి వస్తారు. వీరి నుంచి మనకి, మన నుంచి వీరికి అందే బహుమతులపై ఎలాంటి పన్ను వర్తించదు.

పన్ను పోటు లేని బహుమతులు

- పెళ్లిళ్ల సమయంలో వధూవరులకు వచ్చే గిఫ్టులు
- ఐటీ చట్టం పేర్కొన్న దగ్గరి బంధువుల నుంచి అందే బహుమతులు
- వారసత్వంగా లేదా వీలునామా ద్వారా సంక్రమించే గిఫ్టులు
- ప్రభుత్వం వద్ద నమోదైన మతపరమైన, దాతృత్వ ట్రస్టుల నుంచి అందే బహుమతులు
- ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆస్పత్రులు, వైద్య సంస్థల నుంచి అందే గిఫ్టులు
- యూనివర్సిటీలు, విద్యా సంస్థల నుంచి అందే ఉపకార వేతనాలు, గ్రాంట్లు, ఆర్థిక సాయం
- మున్సిపల్, స్థానిక ప్రభుత్వ సంస్థల నుంచి అందే బహుమతులు
- కేవలం ఒక వ్యక్తి ప్రయోజనం కోసం ఏర్పాటైన ట్రస్టుల నుంచి అందే బహుమతులు
- యాజమాన్య హక్కుల బదిలీ లేకుండా అందే బహుమతులు
- కార్లు, ఫోన్లు, టీవీలు, ఫర్నీచర్, వాచీల వంటి బహుమతుల విలువ రూ.50,000 మించినా పన్ను పోటు ఉండదు.

రిటర్నుల్లో ఎలా వెల్లడించాలి?

ఒక ఆర్థిక సంవత్సరంలో అందే బహుమతుల విలువ రూ.50,000 మించితే తప్పకుండా ఆ విషయాన్ని 'ఇతర ఆదాయం' సెక్షన్‌లో వెల్లడించాలి. ఒకవేళ వాటి విలువ రూ.50,000 కంటే తక్కువగా ఉన్నా 'ఎగ్జెంప్ట్ ఇన్‌కం' సెక్షన్‌లో వెల్లడించడం మంచిది. దీనివల్ల మన ఆదాయ వెల్లడిలో పారదర్శకత పెరిగి ఐటీ శాఖ మన రిటర్నులు స్క్రూటినీ చేసే అవకాశాలు తగ్గుతాయి.

బిజినెస్ ప్లస్

క్రెడిట్ కార్డుతో నగదు తీసుకుంటున్నారా..


తొలి రోజు నుంచే వడ్డీ

జాగ్రత్తలు తీసుకోకపోతే గుదిబండగా మారే ప్రమాదం

ఎప్పుడు ఎవరికి ఎలాంటి అవసరం వస్తుందో తెలియదు. ఆ సమయంలో చేతిలో డబ్బులు ఉంటాయనే గ్యారెంటీ లేదు. అప్పుడు బంధుమిత్రుల నుంచి లేదా బ్యాంకు నుంచి అప్పు చేయక తప్పదు. ఇవేవీ సాధ్యం కాకపోతే క్రెడిట్ కార్డు ద్వారా నగదు విత్‌డ్రా చేయడం ఒక్కటే మార్గం. అయితే ఇది అంత క్షేమం కాదు. ఇందుకు అధిక వడ్డీతో పాటు చార్జీల రూపంలోనూ భారీగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో క్రెడిట్ కార్డు ద్వారా అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్‌లో ఉన్న సమస్యలు ఏమిటో తెలుసుకుందాం...

చార్జీలు

క్రెడిట్ కార్డు అంటేనే ఫీజులు, వడ్డీలు. ఇక ఈ కార్డులతో విత్‌డ్రా చేసే అడ్వాన్స్ నగదుపై వడ్డీ భారం మరింత ఎక్కువగా ఉంటుంది. ప్రతి నగదు విత్‌డ్రాయల్స్‌పై కనీసం రూ.250 నుంచి రూ.500 చొప్పున ఫీజు చెల్లించాలి. విత్‌డ్రా చేసే నగదును బట్టి ప్రతి లావాదేవీ విలువలో ఇది 2.5 శాతం నుంచి 3 శాతం వరకు ఉంటుంది. క్రెడిట్ కార్డు కంపెనీలు జారీ చేసే బిల్లింగ్ స్టేట్‌మెంట్‌లో ఈ చార్జీల వివరాలు ఉంటాయి.

వడ్డీ రేటు

క్రెడిట్ కార్డుల ద్వారా విత్‌డ్రా చేసే నగదు అడ్వాన్స్‌పై బ్యాంకులు నెలవారీ పద్ధతిలో వడ్డీ రేటు వసూలు చేస్తాయి. సాధారణంగా ఈ వడ్డీ రేటు 2.5 నుంచి 3 శాతం మధ్య ఉంటుంది.

లేటు చెల్లింపులు వద్దు

ఈ చెల్లింపులను ఒకేసారి వీలైనంత త్వరగా చెల్లించడం మంచిది. చేతిలో డబ్బులు లేవని కొద్దికొద్దిగా ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో చెల్లిస్తే ఫీజుల భారం తడిసి మోపెడవుతుంది. సాధారణంగా ఇది మిగిలిన బకాయి మొత్తంలో 15 నుంచి 30 శాతం వరకు ఉంటుంది. ఆలస్యంగా చేసే అడ్వాన్స్ నగదు చెల్లింపులు ఆర్థిక భారంతో పాటు క్రెడిట్ స్కోరునూ దెబ్బతీస్తాయి.

క్రెడిట్ కార్డుపై కొనే వస్తువుల బకాయిలు చెల్లించేందుకు కొంత ఇంటరెస్ట్ ఫ్రీ గడువు ఉంటుంది. అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్‌కు ఇలాంటి సౌలభ్యం ఉండదు. నగదు విత్‌డ్రా చేసిన రోజు నుంచి చెల్లించే రోజు వరకు వడ్డీ భారం తప్పదు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్‌ను ఎంత త్వరగా చెల్లిస్తే అంత మంచిది.

పరిమితులు

క్రెడిట్ కార్డు చేతిలో ఉన్నంత మాత్రాన ఎంత పడితే అంత అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్ కుదరవు. మీ క్రెడిట్ కార్డు క్రెడిట్ లిమిట్‌లో ఒక పరిమితికి లోబడి మాత్రమే ఈ నగదు ఉపసంహరణ సాధ్యం. ఒకవేళ దీన్ని ఉపయోగించుకున్నా ఆ మొత్తాన్ని నిర్ణీత గడువులోగా ఒకేసారి చెల్లించాలి. లేకపోతే అది గుదిబండగా మారే ప్రమాదం ఉంది.



ఎల్ఐసీ గిన్నిస్ వరల్డ్ రికార్డు

ఒక్క రోజులో 5,88,107 పాలసీల విక్రయం

ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) సరికొత్త చరిత్ర సృష్టించింది. కేవలం 24 గంటల్లో 5,88,107 జీవిత బీమా పాలసీలను విక్రయించడం ద్వారా గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లోకి ఎక్కింది. ఒక్క రోజులో ఇన్ని పాలసీలు అమ్మిన బీమా కంపెనీ ఇదే. ఈ జనవరి 20న సంస్థకు చెందిన 4,52,839 ఏజెంట్లు ఈ పాలసీలను విక్రయించినట్లు ఎల్ఐసీ వెల్లడించింది. "ఇది మా ఏజెంట్ల అవిశ్రాంత అంకితభావం, నైపుణ్యం, నైతికతకు బలమైన ధ్రువీకరణ. మా కస్టమర్లు, వారి కుటుంబాలకు బీమా ద్వారా ఆర్థిక రక్షణ కల్పించాలన్న మా లక్ష్యం పట్ల నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుంది" అని ఎల్ఐసీ పేర్కొంది. 'మ్యాడ్ మిలియన్ డే' పేరుతో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఈ జనవరి 20న ప్రతి ఏజెంట్ కనీసం ఒక పాలసీనైనా విక్రయించాలని ఎల్ఐసీ ఎండీ, సీఈఓ సిద్ధార్థ మొహంతి కోరారు. దాంతో ఏజెంట్లందరూ కలిసి రికార్డు స్థాయిలో పాలసీలను విక్రయించారు.


ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	119
వరంగల్	120	గుంటూరు	122
కరీంనగర్	120	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	111
కర్నూలు	120	నెల్లూరు	116
విశాఖపట్నం	116	అనంతపురం	116
గోదావరి	119		


ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

25వ తేదీ



హైదరాబాద్	500	విజయవాడ	510
వరంగల్	502	గోదావరి	485
చిత్తూరు	603	విశాఖపట్నం	513
		డజను గుడ్లు రూ. 72	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,080 ▲	89,900 ▲	1,10,900 ▼
విజయవాడ	99,700 ▲	93,500 ▲	99,700 ▼
విశాఖపట్నం	98,080 ▼	89,900 ▲	1,10,900 ▲
రాజమండ్రి	98,070 ▲	89,900 ▲	1,03,000 ▲
ప్రొద్దుటూరు	96,200 ▼	88,500 ▼	99,200 ▼
ముంబై	95,471	87,451	96,909

రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ..

- మారుతిరెడ్డి, తహసీల్దార్



ఆంధ్రజ్యోతి : రేషన్ కార్డుల జారీకి గడువు తేదీ ఉందా?

తహసీల్దార్ : రేషన్ కార్డుల జారీకి సంబంధించి కటాఫ్ తేదీ అంటూ లేదు.కార్డుల జారీ నిరంతర ప్రక్రియ. చేరికలకు గానీ కొత్త రేషన్ కార్డుల కోసం గానీ అర్హులైన వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

ఆంధ్రజ్యోతి : ఇప్పటి వరకు కొత్త రేషన్ కార్డులు ఎన్ని పూర్తి అయ్యాయి ?

తహసీల్దార్ : కొత్త రేషన్ కార్డులకు సంబంధించి గత నెలలో 170 కార్డులు, ఈనెల 140 కార్డుల వరకు పూర్తి అయ్యాయి. ఇక చేరికలకు సంబంధించి గత నెలలో 1900 మందిని, ఈనెల 1400మంది చేరిక ప్రక్రియ పూర్తిచేశాం. చేరికలు గానీ, కొత్త రేషన్ కార్డులకు సంబంధించి గానీ ముందుగా ఉన్న వాటిలోంచి పేర్లు తొలగించుకుంటేనే ఈ ప్రక్రియ త్వరగా పూర్తవుతుంది.

ఆంధ్రజ్యోతి : గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్ల పరిస్థితి ఏమిటి?

తహసీల్దార్ : దాదాపు ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు చేరాయి. ఇంకా రెండు లేదా మూడు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఉంది. వీటిని కూడా వాహనాల్లో తరలించే కార్యక్రమం కొనసాగుతోంది. తడిసిన ధాన్యం, మొలకెత్తిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తున్నాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

ఆంధ్రజ్యోతి : భూ సమస్యలు, రిజిస్ట్రేషన్ సందేహాలపై ఎవరిని సంప్రదించాలి?

తహసీల్దార్ : దళారులు, మధ్యవర్తులు, బ్రోకర్లను నమ్మవద్దు. మా పరిధిలో ఉండే భూసమస్యతోపాటు రిజిస్ట్రేషన్, స్లాట్‌బుకింగ్ తదితర సమస్యలపై ఎవరైనా నేరుగా వచ్చి పరిష్కరించుకోవచ్చు.

- గంభీరావుపేట (ఆంధ్రజ్యోతి)

ప్రొటోకాల్ నిబంధనలు అతిక్రమించిన అధికారులపై చర్య తీసుకోవాలి

సిరిసిల్ల క్రైం, మే 24 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా సిరిసిల్ల నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే కె. తారకరామారావును ఆహ్వానించకుండా ప్రొటోకాల్ నిబంధనలు అతిక్రమించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మహేశ్ బి. గీతేను కలిసి తంగళ్లపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు మాట్ల మధు, ఎస్ చిరంజీవి, జి. ప్రేంకుమార్, బండి జగన్, అమర్‌రావు, భాస్కర్, పి. విష్ణుబాబు, ఎ. భరత్, ప్రశాంత్‌రెడ్డిలు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో ఎలాంటి అధికారం లేని కాంగ్రెస్ నాయకులు కెకె మహేందర్‌రెడ్డిని ఆహ్వానించడంలో కలెక్టర్ ఆజ్యం పోస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి విషయాలపై పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు లేవని, ఇప్పటికైనా అధికారిక కార్యక్రమాలను ప్రొటోకాల్ ప్రకారం నిర్వహించాలని వారు కోరారు. ప్రొటోకాల్ నిబంధనలకు అతిక్రమిస్తూ అశాంతికి గురిచేస్తూ రాజ్యాంగానికి విరుద్ధంగా వివాదాస్పద కార్యక్రమాలను నిర్వహిస్తున్న కలెక్టర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ప్రొటోకాల్ పాటించని కలెక్టర్

- సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు మాట్ల మధు

సిరిసిల్ల రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల నియోజకవర్గంలో ఇందరిమ్మ ఇళ్ల మంజూరీతోపాటు పట్టాల పంపిణీ కార్యక్రమాలకు స్థానిక ఎమ్మెలే కేటీఆర్‌ను ఆహ్వానించకపోవడంతోపాటు ప్రొటోకాలను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఉల్లఘించారని దీనిపై రాష్ట్ర ప్రభుత్వం చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని రాజన్న సిరిసిల్ల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు మాట్ల మధు డిమాండ్ చేశారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పట్టాలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధికారంగా చేపట్టిన కార్యక్రమాలకు స్థానిక ఎమ్మెల్యేను ఆహ్వానించకపోగా కేటీఆర్‌పై ఓడిపోయి ప్రభుత్వం ఎలాంటి పదవులు లేని కేకే మహేందర్‌రెడ్డిని ఆహ్వానించడం శోచనీయమన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతోపాటు కలెక్టర్‌పై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కేటీఆర్ సేనా రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్, యూత్ జిల్లా నాయకులు శీలం స్వామి, చిలువేరి చిరంజీవి, వేముల నరేష్, మెరుగు తిరుపతి, కిరణ్, బండి జగన్, గుండు ప్రేమ్‌కుమార్, భాస్కర్‌గౌడ్, ఎండి జహంగీర్, రత్నాకర్, అమర్‌రావు, రాజేశ్వర్‌రావు, శేఖర్‌చారీ, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

బోయినపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. బోయినపల్లి మండలం మాన్వాడ, మల్లాపూర్ గ్రామాల్లో తడిసిన వరి ధాన్యానిన మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమం పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కత్తెరపాక కొండయ్య, మల్లారెడ్డి, భీమనాథుని రమేష్ తదితరులు ఉన్నారు.

సొంతిల్లు పేదవారి ఆత్మగౌరవ ప్రతీక

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



కోనరావుపేటలో ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ప్రభుత్వ విప్, కలెక్టర్



రుద్రంగిలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్న ప్రభుత్త విప్

కోనరావుపేట, మే 24 (ఆంధ్రజ్యోతి) : పేదవారి ఆత్మగౌరవ ప్రతీక సొంత ఇల్లు అని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. కోనరావుపేటలో మండల కేంద్రంలో శనివారం రెండో విడతలో 561 ఇందిరమ్మ ఇళ్ల మంజూరి ఉత్తర్వులు కలెక్టర్ సందీప్ కుమార్ ఝూతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాము ఇచ్చిన హామీ మేరకు ఇంటిస్థలం, భూమి పత్రాలు ఉన్న పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేశామని తెలిపారు. వేములవాడ నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లకు మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. నిర్ణీత సమయం, ప్రభుత్వం సూచించిన కొలతల ప్రకారం ఇల్లు నిర్మించుకొని సహాయం పొందాలన్నారు. 561 మంది లబ్ధిదారులను పారదర్శకంగా అర్హులుగా ఎంపిక చేసి ఉత్తర్వులు పంపిణీ చేశామని తెలిపారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు 4 దశలలో 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందుతుందని, 400చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగుల లోపు ఇంటి నిర్మాణం చేసుకోవాలని స్పష్టం చేశారు. 4 దశలో గ్రీన్‌చానల్ ద్వారా ఆర్థిక సహాయం అందుతుందని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, వైస్‌చైర్మన్ తాళ్లపెల్లి ప్రభాకర్, కాంగ్రెస్ జిల్లా నాయకులు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషాతో పాటు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, తహ సీల్దార్ వరలక్ష్మి, హౌసింగ్ పిడి శంకర్, సంబంధిత అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● రుద్రంగి, మే 24 (ఆంధ్రజ్యోతి): స్వంత ఇంటి కలను ఇందిరమ్మ ప్రభుత్వం సాకారం చేస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో 243 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మంత్రులు పొంగులేటి శ్రీనివాస్, సీతక్క, పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్లను భూమి పూజలు చేసుకోవడం జరిగిందన్నారు. మరో 83 ఇళ్లను వారం రోజుల్లో మంజూరు చేస్తానాన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, ఎంపీడీవో నాటరాజ్, తహసీల్దార్ పుష్పలత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తూం జలపతి, గ్రామశాఖ అధ్యక్షులు సామ మోహన్‌రెడ్డి,మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, మాడిశెట్టి అభిలాష్, కెసిరెడ్డి నర్సరెడ్డి, తర్రె లింగం, స్వర్గం పరందామ్, సూర యాదయ్య, పూదరి మహిపాల్, గుగ్గిళ్ల వేంకటేశం, దసారి గంగారాజం తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దృష్టిని మళ్లించేందుకే కవిత లేఖ లీక్

- సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



సిరిసిల్లలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వం ప్రాజెక్టు విషయంలో కమిషన్ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావు, ఈటల రాజేందర్‌లకు నోటీసలను అందించి విచారణకు రావాలని కోరడంతో ప్రజల దృష్టిని మళ్లించాలనే లక్ష్యంతో ఎమ్మెల్సీ కవిత లేఖను లీక్‌చేశారని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ లేఖ పేరుతో రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబంలో జరుగుతున్న కుమ్ములాటలు, కుటుంబా కలహాలను కప్పిపుచ్చడానికి ఎమ్మెల్సీ కవిత తన తండ్రి కేసీఆర్‌కు లేఖ రాసిన దానిని లీక్ చేసి డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. కాళేశ్వం ప్రాజెక్టు నిర్మాణాల్లో జరిగిన అవినీతి అక్రమాలతో పాటు నాణ్యత లోపాలతోనే ప్రాజెక్టు కుంగిపోయిందన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే ఆ ప్రాజెక్టు కుంగిపోయిందన్నారు. ఆ సమయంలోనే దానిపై విచారణకు ఆదేశాలకు జారీ చేయకుండా కుట్రల్లో భాగంగానే బాంబులు పెల్చి ప్రాజెక్టులను కుంగిపోయేలా చేశారని బీఆర్ఎస్ నాయకులు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత దానిపై విచారణ చేపట్టడంతో జస్టిస్ కమిషన్‌ను నియమించి విచారణ చేపట్టడం జరుగుతుందన్నారు. అ ప్రాజెక్టుపై కేంద్ర అధ్యాయన కమిటి పరిశీలించి ప్రాజెక్టులో నీటిని నిలిపి పెను ప్రమాదం ఉందని చెప్పడంతో కాంగ్రెస్ పార్టీ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు, వరద కాలువలతోనే గోదావరి జలాలను ఈప్రాంతంలో ప్రాజెక్టులలోకి తరలించి సాగునీటిని అందించిన విషయాన్ని గుర్తించాలన్నారు. ఆ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన లోపాలను జస్టిస్ కమిషన్ గుర్తించి దీనిపై విచారణకు రావాలని మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రులు ఈటెల రాజేందర్, హరీష్‌రావులకు నోటీసులు పంపిస్తే వారితోపాటు పార్టీ నాయకుల్లో భయం పుట్టుకొస్తుందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఎప్పుడు ఒకటేనని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ వెల్మల స్వరూప తిరుపతిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు అకునూరి బాలరాజు, నాయకులు చెన్నమనేని కమలాకర్‌రావు, కత్తెర దేవదాస్, వైద్యశివప్రసాద్, యెల్లె లక్ష్మీనారాయణ, కోడం అమర్, అడెపు జగన్, శ్రీగాధ మైసయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, అడెపు చంద్రకళా, మడుపు శ్రీదేవి, కల్లూరి చందన తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై దృష్టి సారించాలి

సిరిసిల్ల రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి) : రైతులు సాగు చేస్తున్న వ్యవసాయంలో పాతపద్ధలను వదిలి ఆదునిక వ్యసాయంపై దృష్టి సారించడంతో పాటు సేంద్రియ పంటల సాగులపై మక్కువ చూపాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ కనకదుర్గా, డాక్టర్ భవ్యశ్రీలు కోరారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో చేపట్టిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు - అన్నదాతలకు అవగాహన కార్యక్రమాల్లో భాగంగా శనివారం సిరిసిల్ల అర్బన్ పరిధిలోని బోనాల రైతు వేదికలో జిల్లెల్ల బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులకు క్షేత్రస్థాయిలో అవసరమయ్యే అంశాలపై అవగాహన కల్పించారు. రైతులు వ్యవసాయ సాగులో యూరియాను వాడకం తగ్గించడం కోసం పచ్చిరొట్ట పంటలను సాగుచేసుకోవాలన్నారు. అవసరం మేరకు రసాయనాలను వినియోగించడం వల్ల నేలను ఆరోగ్యంగా ఉంచవచ్చునని అన్నారు. రైతుల తాము వ్యవసాయం కోసం కొన్న విత్తనాలు, ఎరువులు, మందులకు రషీద్‌లు తీసుకుని భద్రపర్చుకుంటే కష్టకాలంలో నష్టపరిహారాన్ని పొందడానికి అవి ఉపయోగపడుతాయన్నారు. సాగు నీటిని ఆదా చేయడం వలన భావితరాలకు సహాయం అందించడం జరుగుతుందన్నారు. పంటల మార్పిడి పాటించడం వల్ల సుస్థిర ఆదాయాన్ని పొందవచ్చున్నారు. చెట్లను ఎక్కువగా పెంచుకుని పర్యావరణాన్ని కాపాడుకోవాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు వ్యవసాయానికి సంబంధించిన సందేహాలను రైతులు అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు.



సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త కనకదుర్గ

ఈ కార్యక్రమంలో సిరిసిల్ల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్, ఉద్యన శాఖ అధికారి గోవర్ధన్, వ్యవసాయ విస్తరణ అధికారి రాజ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ బోల్గం నాగరాజుగౌడ్, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన ధాన్యం

- ఆందోళన చెందుతున్నరైతులు



కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన ధాన్యం

చందుర్తి, మే 24 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్ళిన కొనుగోలు మందకొడిగా జరగడంతో రైతులకు తిప్పలు తప్పడంలేదు. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షానికి ధాన్యం మొలకెత్తడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. చందుర్తి మండల కేంద్రంతో పాటు వివిధ గామాల్లో ఐకెపి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నెల రోజుల క్రితం ప్రారభించారు. కొనుగోలు మందకొడిగా జరగడంతో ఇబ్బందులు పడవలసి వస్తుందని రైతులు వాపోతున్నారు. ఇటీవల వరుసగా వర్షలు కురువడంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి మొలకెత్తింది. నెల 15 రోజుల క్రితం కేంద్రానికి ధాన్యం తీసుకు వచ్చినప్పటికి కొనుగోలు మందకొడిగా జరుగుతున్నయని రైతులు ఆరోపిస్తున్నారు. లారీల డ్రైవర్లు ఒకొక్క బస్తాకు రైతుల నుండి 2 రూపాయలు ఇచ్చిన రైతుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు లారీలను తీసుకెళ్లుతున్నారని, డబ్బులు ఇవ్వని కొనుగోలు కేంద్రాలకు లారీలు రావడం లేదని రైతులు తెలిపారు. వర్షాలతో ధాన్యం తడిసి మొలకెత్తడంతో నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, కొనుగోలు వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

కొనుగోలు వేగవంతం చేయాలి

- పులి గంగాధర్, రైతు, చందుర్తి .

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి, కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుక వచ్చి నెల 15 రోజులు అవుతుంది. కొనుగోలు మందకొడిగా జరుగుతుంది. వర్షం కురుస్తుండంతో ధాన్యం తడిసి ముద్దవుతుంది.



రూ.60లక్షల నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

- టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో 20 క్వింటాళ్ల స్వాధీనం



పట్టుకున్న విత్తనాలను పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రావు, డీఎస్పీ రామానుజం

కాగజ్‌నగర్ టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : కాగజ్‌నగర్ మండలంలోని పెద్దవాగు బ్రిడ్జి సమీపంలో 60 లక్షల విలువ చేసే నకిలీ పత్తి విత్తనాలు శనివారం పోలీసులు పట్టుకున్నారు. ముందస్తుగా అందిన సమాచారం ప్రకారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు 20 క్వింటాళ్ల పత్తి విత్తనాలు పట్టుకొన్నట్లు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కొమ్రంభీంఆసిఫాబాద్ జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు కాగజ్‌నగర్ కాపువాడకు చెందిన కొత్తపల్లి సదాశివ నకిలీ పత్తి విత్తనాలు అమ్మకాలు సాగిస్తున్నాడన్న సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించారు. పెద్దవాగు బ్రిడ్జి సమీపంలో అనుమానాస్పదంగా వెళ్తన్న ఐచర్ వ్యాన్ ఏపీ 39 టివై 9741ను తనిఖీ చేశారు. వ్యాన్‌లో 20 క్వింటాళ్ల (60లక్షల విలువగల) ప్రభుత్వ నిషేదిత నకిలీ బీటీ 3రకం విత్తనాలు లభ్యమయ్యాయి. వీటిని స్వాధీనం చేసుకొని నిందితుడు కొత్తపల్లి సదాశివ్‌ను విచారించగా, రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మర్రిగడ్డకు చెందిన వేణుగోపాల్‌రెడ్డి అనే వ్యక్తి, మహారాష్ట్రకు చెందిన సంతోష్ కిషోర్ అనే మరో వ్యక్తి ద్వారా వాహనంలో కాగజ్‌నగర్ వైపు తరలిస్తున్నట్లు సమాచారం ఇచ్చాడని తెలిపాడన్నారు. దీంతో వాహనాన్ని తనిఖీ చేసి పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకొని, డ్రైవర్ పుప్పాల లక్ష్మణ్(కర్నూల్ జిల్లా)ను అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాణాప్రతాప్, కాగజ్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాస్‌రావు, ఎస్సైలు సందీప్, వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

రోహిణీ కార్తె ఆగమనం..

(5వ పేజీ తరువాయి)

రైతులు పేర్కొంటున్నారు. కార్తెకార్తెకు తీరొక్క విత్తనాలు వేసేవాళ్లమని, ఇప్పుడు కార్తెలనే పట్టించుకునే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

జిల్లాలో వానాకాలం సాగు 2.43 లక్షల ఎకరాలు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో వానాకాలంలో 2 లక్షల 43 వేల 773 ఎకరాల్లో వివిధ పంటలు వేయడానికి రైతులు సిద్ధమైనా వరి, పత్తిసాగు ప్రధాన పంటలుగా సాగు చేస్తారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో వరి లక్షా 84 వేల 860 ఎకరాలు, పత్తి 49,760 ఎకరాలు, పెసర 79 ఎకరాలు, కందులు 1,155 ఎకరాలు, మొక్కజొన్న 1,600 ఎకరాలు, జొన్నలు 14 ఎకరాలు, ఇతర పంటలు 6,304 ఎకరాల్లో సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనాలు వేశారు.

వరిసాగుకు 56,568 క్వింటాళ్ల విత్తనాలు..

వానాకాల సీజన్‌కు సంబంధించి రైతులకు ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ విత్తనాలను సిద్ధంగా ఉంచింది. జిల్లాలో 1.84 లక్షల ఎకరాల వరిసాగు కోసం 56,568 క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనాలు వేయగా, పెసర 4.08 క్వింటాళ్లు, మొక్కజొన్న 27.04 క్వింటాళ్లు, పత్తి 1,28,650 ప్యాకెట్లు, కందులు 122.5 క్వింటాళ్లు అవసరమవుతాయని అంచనాలు వేశారు.

56,060 మెట్రిక్ టన్నుల ఎరువులు

వానాకాలం సాగుకు సంబంధించి 2.43 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తుండగా ఎరువులు 56,060మెట్రిక్ టన్నులు అవసరం అవుతాయని అంచనాలు వేశారు. యూరియా 25,370 మెట్రిక్ టన్నులు, డీఏపీ 3,460 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 22,390 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 4,115 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 725 మెట్రిక్ టన్నులు అవసరం అవుతాయని అంచనాలు వేశారు.

జిల్లాలో 49,760 ఎకరాల్లో పత్తి సాగు..

ప్రతిసీజన్‌లోనూ జిల్లాలోని పత్తి రైతులకు నకిలీ విత్తనాలు సమస్యగానే మారాయి. పొరుగున మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఉన్నాయి. వాటిని కేంద్రంగా చేసుకొని అక్రమ వ్యాపారులు నకిలీ పత్తి విత్తనాలను జిల్లాకు చేరవేస్తున్నారు. బ్రాండెడ్ విత్తనాల కంపెనీలకంటే నాణ్యతగల విత్తనాల పేరుతో రైతులను నమ్మించి మోసం చేస్తున్నారు. రైతులు నిషేధిత బీటీ 3విత్తనాలపై ఆసక్తి చూపుతుండడంతో ఆ పేరుతోనే రైతులకు నకిలీ విత్తనాలను అంటగడుతున్నారు. దీనికి తోడుగా ప్రభుత్వం విత్తనాల ధర పెంచడంతో దళారులు తెస్తున్న విత్తనాల కొనుగోలుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. తాజాగా 2025-26 సంవత్సరానికి బీటీ-2 పత్తి విత్తన 475 గ్రాముల ప్యాకెట్ ధరను రూ.901 నిర్ణయిస్తూ కేంద్ర వ్యవసాయ శాఖ నోటిఫికేషన్ జారీచేసింది. గతేడాది పత్తి విత్తనాల ప్యాకెట్ రూ.864ఉండగా, ప్రస్తుతం రూ.901వరకు పెంచారు. ఒక ప్యాకెట్‌పై రూ.37 పెరిగింది. దీంతో పాటు ఎరువులు, మందులు, వ్యవసాయ కూలీల ధరలు రైతులకు మరింత భారాన్ని పెంచింది. ఈసారి రైతులు దాదాపు రూ.30లక్షల అదనపు భారాన్ని మోయాల్సి వస్తుంది. ప్రతియేటా విత్తనాల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. పత్తి పండించే రైతులు ప్రైవేటులోనే విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తోంది. రైతులు ఎక్కువగా బీటీ 2 విత్తనాలనే వినియోగిస్తున్నారు. ఎకరానికి రెండు ప్యాకెట్లకు పైనే ఉపయోగిస్తారు. మరోవైపు అనుకూల పరిస్థితులు లేని పక్షంలో రెండవసారి కూడా విత్తనాలు వేసుకునే పరిస్థితి ఉంటుంది.

అర్హులను మాత్రమే ఎంపిక చేయాలి

వేములవాడ రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): అర్హులకు మాత్రమే రాజీవ్ యువ వికాస్ అందజేయాలని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు జక్కుల తిరుపతి అన్నారు. రాజీవ్ యువ వికాస్ పథకం పక్క దారి పడుతుందని అర్హులైన నిరుపేదలకు మాత్రమే పథకం అందజేయాలని అయన బీజేపీ నాయకులతో కలిసి శనివారం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. అనంతరం జక్కుల తిరుపతి మాట్లాడుతూ రాజీవ్ యువ వికాస్ పథకం పొందడానికి సిబిల్ స్కోర్ ఉండాలనే నిబంధన సరికాదన్నారు. గ్రామాల్లో కేవలం అధికార పార్టీ కార్యకర్తలు మాత్రమే ఈ పథకానికి అర్హులని కొంత మంది యువతను మభ్యపెడుతున్నట్లు సమాచారం వచ్చిందని ఇది సమంజసం కాదన్నారు. అర్హులైన వారికే పథకాన్ని అందజేయాలన్నారు. పేదలను కాదని అధికార పార్టీకి అనుకూలంగా ప్రభుత్వ అధికారులు అనర్హులను ఎంపిక చేస్తే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు. అనర్హులను పథకానికి ఎంపిక చేస్తే అధికారులే పూర్తి బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షాలు సమృద్ధిగా కురవాలని పూజలు

ఎల్లారెడ్డిపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు విరివిగా పండాలని వేడుతూ ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో రైతులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు గోపాలచారి, శివశాస్త్రిల ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకం, తదితర కార్యక్రమాలను జరిపించారు. అకాల వర్షాల బారి నుంచి యాసంగి పంటను కాపాడాలని పేర్కొంటూ గతంలో వేసిన ముడుపును విప్పారు. కార్యక్రమంలో రైతులు మాజీ సర్పంచ్ నర్సయ్య, ఆలయ కమిటీ చైర్మన్లు హన్మండ్లు, లక్ష్మారెడ్డి, రైతులు మల్లారెడ్డి, గోవర్ధన్, పర్శరాములు, సుధాకర్‌రెడ్డి, కొండయ్య, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

మట్టి కుప్పలు పోస్తే జరిమానా

ఇల్లంతకుంట, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాలిపెల్లి గ్రామంలో ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా మట్టికుప్పలు పోస్తే జరిమానా విధిస్తామని పంచాయితీ కార్యదర్శి అనీల్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని ఎస్సీకాలనీ సమీపంలోని సెల్‌ఫోన్ టవర్ వద్ద ఇష్టానుసారంగా మట్టిపోస్తున్నారని, దీనితో వర్షం పడినప్పుడు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. మట్టికుప్ప పోస్తే రూ.5వేల జరిమానా విధిస్తామన్నారు. ట్రాక్టర్ యజమానులు ఈవిషయాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

ఎల్లారెడ్డిపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి, అక్కపల్లి గ్రామాల్లోని లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు శనివారం అందజేశారు. ఆపదలో నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ పథకం వరం లాంటిదని పేర్కొన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వ కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, సాహెబ్, బాబు, గిరిధర్‌రెడ్డి, రాములు, బుచ్చాగౌడ్, రఫీక్, బాల్‌రెడ్డి, శ్రీనివాస్, గోపాల్, చందు, శంకర్, ధర్మేందర్, సంతోష్, కనకరాజు, నారాయణరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, రాజిరెడ్డి, పర్శరాములు, సాయిప్రేమ్, సుధాకర్, రాజేశం, రాజిరెడ్డి, లత తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుకు మరమ్మతులు

వీర్నపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల కేంద్రంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రధాన రహదారి బురద నీటితో గుంతలమయమైంది. దీంతో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్ జెసిపితో మట్టి పోసి చదును చేశారు. ప్రయాణికులకు ఇబ్బందులు కాకుండా తాత్కాలిక మరమ్మతులు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వెంట గ్రామ శాఖ అధ్యక్షుడు చంద్రమౌళి, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుడు దేశరాజు కుమార్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఎల్లారెడ్డిపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ దిన పత్రిక విలేకరి మజీద్, శిల్ప కళాకారుడు అజీజ్ కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి శనివారం పరామర్శించారు. మజీద్ ఇటీవల ప్రమాదవశాత్తు కింద పడడంతో కాలు విరిగిపోయింది. అజీజ్ తల్లి హుస్సేన్‌బీ అనారోగ్యంతో మృతి చెందింది. ఆ కుటుంబాలను పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట నాయకులు నర్సయ్య, బాబు, గిరిధర్‌రెడ్డి, మల్లేశం, వెంకటేశ్, రాజ్‌కుమార్, ఇమాం, గోపాల్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, కిషన్ ఉన్నారు.

కాంగ్రెస్ నాయకులను పరామర్శించిన కేకే..

తంగళ్లపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులను సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి పరామర్శించారు. గ్రామానికి చెందినా కాంగ్రెస్ నాయకులు ఇట్టిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నర్రా గోపాల్‌రెడ్డి, ఉడుతల రాజయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా వారిని కేకే, కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జలగం ప్రవీణ్, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.